ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలోనే ఒక సంచలన తీర్పు వెలువడింది. చిత్తూరు మొదటి మేయర్ కఠారి అనురాధ దంపతుల హత్య కేసులో ఐదుగురికి చిత్తూరు కోర్టు శుక్రవారం ఉరి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. 2015 నవంబరు 17న కఠారి అనురాధ, మోహన్ దంపతుల్ని నగరపాలక సంస్థ కార్యాలయంలోనే క్రూరంగా హత్య చేశారు. పదేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం శుక్రవారం ఉదయం 10:50 గంటలకు న్యాయమూర్తి శ్రీనివాసరావు తుది తీర్పు ప్రకటించారు.

- చిత్తూరు లీగల్, ఆంధ్రజ్యోతి



ఇదీ తీర్పు!

- ఏ1 నుంచి ఏ5 దాకా చింటూ, వెంకటా చలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్‌లకు ఉరిశిక్ష.
- ఏ1 చింటూ బాధిత కఠారి కుటుంబీకులకు రూ.50 లక్షలు, గాయపడిన సతీష్‌కు రూ.20 లక్షలు పరిహారం చెల్లించాలి.
- ఏ2, ఏ3, ఏ4, ఏ5లకు రూ.11,500 చొప్పున జరిమానా.

సాక్షులకు నోటీసులు

పోలీసుల విచారణలో చెప్పిన వాంగ్మూలాన్ని కోర్టులో చెప్పకుండా అబద్ధం చెప్పిన 9 మంది సాక్షుల నుంచి సంజాయిషీ కోరుతూ నోటీసులు జారీ చేయాలని కోర్టు సిబ్బందిని న్యాయమూర్తి ఆదేశించారు.

కఠారి దంపతుల హత్య కేసులో 5 గురికి ఉరి

శిక్ష ప్రకటించిన న్యాయమూర్తి



వెంకటాచలపతి | జయ ప్రకాష్‌రెడ్డి | చింటూ | మంజునాథ్ | వెంకటేష్

- బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు పరిహారం
- గాయపడిన ప్రత్యక్ష సాక్షికి రూ.20 లక్షలు ఇవ్వాలని ఆదేశం

కేసులో నిందితులు: శ్రీరామచంద్రశేఖర్ అలియాస్ చింటూతో పాటు 22 మంది.

సాక్షులు: 133 మంది. విచారించింది 57 మందిని

బెయిల్: చింటూ, జయప్రకాష్, మంజునాథ్ మినహా మిగిలినవారికి హైకోర్టు షరతులతో కూడిన బెయిళ్లను మంజూరు చేసింది. ప్రధాన నిందితుడు చింటూకు సుప్రీంకోర్టు బెయిల్ ఇచ్చింది. జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్‌లకు బెయిల్ రాకపోవడంతో రిమాండ్ ఖైదీలుగా కోర్టు వాయిదాలకు హాజరయ్యేవారు.

352 వాయిదాలు:

2015 ఫిబ్రవరి 16న చిత్తూరు ఒకటవ పట్టణ పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. అప్పటి నుంచి ఈ కేసుకు సంబంధించి 355 వాయిదాలు జరిగాయి. కొన్నిసార్లు నిందితులు నేరుగా కోర్టుకు హాజరుకాగా... ఇంకొన్నిసార్లు జైలు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వాయిదాలకు హాజరయ్యారు. ఈ పదేళ్ల కాలంలో కఠారి దంపతుల హత్య కేసు రకరకాల కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది.2025 నవంబరు 10వ తేదిలోపు తీర్పు ఇవ్వాలని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు జిల్లా కోర్టు సాక్షుల విచారణను వేగవంతం చేసి శుక్రవారం శిక్షలు ఖరారు చేస్తూ తీర్పు ప్రకటించింది.

కేసు.. సెక్షన్లు..

హత్య జరిగిన సమయంలో ప్రత్యక్ష సాక్షి సతీష్‌కుమార్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా అప్పటి వన్ టౌన్ సీఐ నిరంజన్‌కుమార్ పలు సెక్షన్ల కింద 130-2015 నెంబరుతో కేసు పెట్టారు. 147, 148, 302, 307, 326, 120-బీ, 109 రెడ్‌విత్ 149, ఐపీసీ సెక్షన్ 212, 216, 201, ఐపీసీ సెక్షన్ 25 (1ఏ), సెక్షన్ 25 (1ఏఏ), సెక్షన్ 25 (1బీ)(ఏ), సెక్షన్ 25 (1బీ)(సీ), సెక్షన్ 27 (3) అండ్ సెక్షన్, 30ఆఫ్‌ది ఆర్మ్స్ యాక్ట్ 1959 కింద కేసు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించారు. అప్పటి ఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ ఆదేశాల మేరకు డీఎస్పీ లక్ష్మీనాయుడు ఆధ్వర్యంలో దర్యాప్తు సాగింది. 69 మంది వాంగ్మూలాలను నమోదు చేశారు. ఏ2 నుంచి ఏ23 వరకు ఉన్న నిందితులను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. 22వ నిందితుడైన శ్రీకాళహస్తికి చెందిన కాసరం రమేష్‌ను విచారణ సమయంలోనే కోర్టు డిశ్చార్జ్ చేసింది. 21వ నిందితుడు శ్రీనివాసాచారి వయసైపోయి మరణించాడు.

తుది తీర్పు.. వారం రోజుల ఉత్కంఠ

పదేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నెల 24వ తేదీన ఈ కేసు తుది దశకు చేరుకుంది. ఈ కేసులో ఉన్న నిందితులంతా కోర్టుకు వచ్చారు. ఏ1 నుంచి ఏ5 వరకు నిందితులపై శిక్ష ఖరారైందని, మిగిలినవారిపై కేసు కొట్టేస్తున్నట్లు కోర్టు తీర్పు ఇచ్చింది. శిక్ష పడ్డ చింటూ, వెంకటా చలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్‌లను కస్టడీలోకి తీసుకోవాలని ఆరవ అదనపు జిల్లా కోర్టు ఇన్‌చార్జి న్యాయమూర్తి శ్రీనివాసరావు ఆదేశించారు. ఐదుగురిపై తుది తీర్పును 30వ తేదీకి వాయిదా వేశారు. 30న చింటూ తరపు న్యాయవాది విజయచంద్రారెడ్డి పలు కేసులకు సంబంధించి సుప్రీంకోర్టు తీర్పుల పత్రాలను జిల్లా న్యాయమూర్తికి అందించారు. నాలుగు గంటల సేపు వాదనల్ని వినిపించారు. పీపీ శైలజ కూడా కోర్టుకు తమ వాదనల్ని వినిపించారు. అలాగే వైద్యాధికారులు, జైలు సూపరింటెండెంట్, పోలీసులు, మానసిక వైద్యులు వేర్వేరుగా ఇచ్చిన నివేదికలను న్యాయమూర్తి పరిశీలించారు. తీర్పును శుక్రవారం వెల్లడిస్తానని చెప్పారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం పోలీసులు కోర్టు పరిధిలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. కక్షిదారులను కూడా అనుమతించలేదు. మీడియా సిబ్బందిని కూడా పరిమితంగానే లోపలికి పంపించారు.



పదేళ్ల నిరీక్షణకు ఫలితం

మా అత్తామామలు కఠారి అనురాధ, మోహన్ హత్యకు కారణమైన చింటూతో పాటు మరికొంతమందిపై కేసు వేశాం. పదేళ్లపాటు ఈ కేసు నడిచినా ఎప్పటికైనా న్యాయమే గెలుస్తుందనే నమ్మకంతోవేచివున్నాం.ఈ పదేళ్లలో ఆర్థికంగా, రాజకీయంగా అష్టకష్టాలు పడ్డాం.కుటుంబ పెద్దల్ని పోగొట్టుకుని అనాథల్లా మిగిలాం.అయినప్పటికీ అత్తామామలను చంపిన వారికి శిక్షపడాలని కోర్టుల చుట్టూ తిరిగాం. అంతిమంగా న్యాయమే గెలిచింది.మా కుటుంబం ఇబ్బందుల్లో ఉన్నప్పుడు టీడీపీ అండగా నిలిచింది.

- కఠారి హేమలత,అనురాధ కోడలు



న్యాయవ్యవస్థపై నమ్మకం పెరిగింది

అమ్మానాన్నలను పోగొట్టుకుని చాలా కోల్పోయాం. చంపిన వారికి శిక్ష పడాలని కోర్టు చుట్టూ తిరిగాం. దేవుడి రూపంలో న్యాయస్థానం మాకు న్యాయం చేసింది. మొదటి నుంచి మాకు న్యాయవ్యవస్థపై నమ్మకం ఉంది. ఆ నమ్మకం ఈ రోజు రుజువైంది.

- లావణ్య, అనురాధ కుమార్తె

సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు



కేసు విచారణ ప్రారంభమైనప్పటి నుంచి నాకు సహకరించిన ఉన్నత స్థాయి అధికారులకు, పోలీసులకు, కోర్టు మానిటరింగ్ అధికారికి, సిబ్బందికి కృతజ్ఞతలు. సకాలంలో సాక్షులను కోర్టుకు హాజరుపరచడం సంతోషకరమైన విషయం,

- పబ్లిక్ ప్రాసిక్యూటర్ శైలజ

ఆ రోజు ఏం జరిగిందంటే..

తేదీ: 2015 నవంబరు 17

స్థలం: చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

సమయం: ఉదయం 11:45 గంటలు

చింటూ, వెంకటాచలపతి బురఖా ధరించి కార్యాలయం లోపలికి వెళ్లారు. వారిద్దరి వెంట జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్ ఉన్నారు. ఐదుగురూ మేయర్ ఛాంబర్‌లోకి వెళ్లారు. చింటూ ముఖానికి ఉన్న బురఖాను తీసి నేనే చింటూనంటూ గట్టిగా అరిచాడు. వెంట తెచ్చుకున్న లేడీస్ హ్యాండ్ బ్యాగులోంచి పిస్టల్ బయటకు తీశాడు. తననేం చేయిద్దంటూ అనురాధ భయంతో గట్టిగా అరిచారు. మేయర్ అనురాధను పాయింట్ బ్లాంక్‌లో కాల్చాడు. ఆమె అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు.

కఠారి మోహన్ అక్కడి నుంచి పరిగెత్తేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పీఏ రూమ్ వద్ద వెంకటేష్ కత్తితో నరకడంతో ఆ గాయంతోనే మోహన్ కేకలు పెడుతూ కాన్ఫరెన్స్ హాల్లోకి పరిగెత్తారు. అక్కడ మంజునాథ్ కత్తితో కడుపులో పొడవగా జయప్రకాష్‌రెడ్డి కూడా నరికాడు. చింటూ, వెంకటాచలపతి పిస్టళ్లతో కాల్పులు జరిపినా మోహన్‌కు తగల్లేదు. ప్రజల్ని భయభ్రాంతులకు గురి చేసేందుకు వెంకటాచలపతి ఎయిర్ గన్ (డమ్మీ గన్)తో కాల్పులు జరిపాడు. మోహన్‌కు బుల్లెట్ తగల్లేదు.

సతీష్‌కి గాయాలు: మేయర్ ఛాంబర్‌లోకి చింటూ వచ్చినప్పుడు సతీష్ అనే వ్యక్తి అంతకుముందే మేయర్‌తో పని ఉండి వచ్చాడు. మేయర్ దంపతులను కాపాడే ప్రయత్నం చేయగా, మంజునాథ్ అతడి వీపు మీద కత్తితో దాడి చేశాడు. దీంతో సతీష్ కూడా అక్కడే గాయాలతో పడిపోయాడు. ఆ తర్వాత వారు ఇంజనీర్ రూమ్ పక్కనున్న గోడ దూకి పారిపోయారు.

అనురాధ, మోహన్, సతీష్‌లను చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.అప్పటికే అనురాధ మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మోహన్, సతీష్‌లను వేలూరు సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. మోహన్ చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించారు. బతికి యటపడ్డ సతీష్ ఈ కేసులో ప్రధాన సాక్షిగా నిలిచారు.

హత్య చేసి పోలీసుల వద్దకు..

హత్య జరిగిన రోజు మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో వెంకటాచలపతి, జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్ చిత్తూరు వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తమకు కఠారి మోహన్ అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని పోలీసులకు చెప్పారు. దీంతో పోలీసులు ఆ ముగ్గుర్నీ గంగవరం మండలంలోని మారేడుపల్లెలో ఉన్న మంజునాథ్ ఇంట్లో తమ అధీనంలోనే పెట్టుకున్నారు. ప్రాథమిక విచారణలో వారి హస్తం ఉందని తెలిసి 24వ తేదీన ఆ ముగ్గుర్నీ అరెస్టు చేసి రిమాండుకు పంపించారు.

లొంగిపోయిన చింటూ: అదే నెల 30వ తేదీన చిత్తూరు నాలుగో కోర్టులో చింటూ లొంగిపోయారు. రిమాండుకు పంపించారు. మరో రెండు మూడు రోజుల్లో వెంకటేష్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

నేరస్థుల్లో కనిపించని భయాందోళన



చింటూను కడప జైలుకు తీసుకెళ్తున్న పోలీసులు

చిత్తూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉరిశిక్ష పడిన ఐదుగురు నేరస్థుల్లో ఎలాంటి భయాందోళనా కనించలేదు. జడ్జి ఉరిశిక్ష వేస్తూ తీర్పు చెప్పిన సమయంలో ఐదుగురు నేరస్థులూ కోర్టు హాలులో ఉన్నారు. ఆ సమయంలో వారిలో ఎలాంటి అలజడి కనిపించలేదు. ఏ5 వెంకటేష్ మాత్రం కాస్త కలత చెందినట్లు కనిపించారు. మిగిలినవారిలో ఎలాంటి రియాక్షన్ లేదు. చింటూ అనుచరులు మినహా మిగిలినవారి కుటుంబీకులు, బంధుమిత్రులు కోర్టు వద్దకు రాలేదు. చింటూ తల్లి కూడా వయసు మీద పడడం, అనారోగ్యం కారణంగా బెంగుళూరులోని మరో కుమారుడి వద్ద ఉంటున్నారు. ఆమె కూడా ఇక్కడికి రాలేదు.శిక్ష పడిన ఐదుగురినీ పోలీసులు కస్టడీకి తీసుకుని వ్యాన్లో కడప సెంట్రల్ జైలుకు తరలించారు. ఆ సమయంలో చింటూ కోర్టు హాలు నుంచి కింద ఉన్న వ్యాను ఎక్కేందుకు వస్తూ అక్కడ కనిపించిన అనుచరులకు నవ్వుతూ చెయ్యి ఊపి వ్యాన్ ఎక్కాడు.



వాలాబీ (ఫైల్ ఫొటో)

మంగళం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ జూపార్కులో శుక్రవారం ఎర్రమెడ గల మగ వాలాబీ అనారోగ్యంతో మృతి చెందినట్లు క్యూరేటర్ సెల్వం తెలిపారు. 'ఈ ఏడాది ఆగస్టు 27న గుజరాత్‌కు చెందిన రాధాకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టు ఒక జత మీర్‌కాట్స్, ఒక జత కామన్ మార్మోసెట్స్‌తో పాటు ఒక ఎర్రమెడగల వాలాబీని జూపార్కుకు విరాళంగా ఇచ్చారు. అప్పట్నుంచి వీటిని సంజీవిని కార్వంటైన్‌లో ఉంచాం. గురువారం ఉదయం నుంచి వాలాబీ అనారోగ్యంతో ఆహారం తీసుకోవడం మానేసింది. జూ వైద్యసిబ్బంది దీనిని ఐసీయూలోఉంచి వైద్యం చికిత్స చేసినా.. శుక్రవారం మృతి చెందింది. కళేబరాన్ని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని పెథాలజీ విభాగ ప్రొఫెసర్ల బృందం పోస్టుమార్టం నిర్వహించి టాక్సో ప్లాస్మోసిస్ సమస్యతో మృతి చెందిందని నిర్ధారించారు' అని క్యూరేటర్ తెలిపారు. వాలాబీతో పాటు తీసుకొచ్చిన మిగిలిన జంతువులు ఆరోగ్యంగా ఉన్నాయన్నారు.

త్వరలో 'శ్రీవారి వైద్య సేవ'

- టీటీడీ ఆసుపత్రుల్లోని రోగులకు శ్రీవారి సేవకుల సేవలు
- ఈవో సింఘాల్



తిరుమల, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఆస్పత్రుల్లో భక్తులు స్వచ్ఛంద సేవ అందించేలా 'శ్రీవారి వైద్యసేవ'ను త్వరలోనే ప్రారంభించాలని టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సూచించారు. శ్రీవారి సేవపై శుక్రవారం ఆయన తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మంతో సమీక్షిస్తూ ఈ సూచన చేశారు. తిరుపతి, తిరుమలలోని ఆయుర్వేద, స్విమ్స్, బర్డ్, చిన్నపిల్లల, అశ్విని ఆస్పత్రుల్లో రోగులకు సేవ చేసేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. ఇందుకోసం శ్రీవారి వైద్యసేవా సెల్‌ను ఏర్పాటు చేయాలన్నారు. ఐఐఎం అహ్మదాబాద్, రాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ శాఖకు సంబంధించిన ముఖ్యమైన శిక్షకులతో నవంబరులో శ్రీవారి సేవకులకు శిక్షణ ఉంటుందని, దీనికి సంబంధించిన ఆడియో, వీడియో విజువల్స్ ట్రైనింగ్ మెటీరియల్ సిద్ధం చేయాలన్నారు.

శ్రీవారి సేవకుల గోసేవ

ఎస్వీ గోసంరక్షణశాలలోనూ శ్రీవారి సేవకులు గోసేవ చేయడానికి వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే దేశంలోని టీటీడీ ఆలయాల్లోనూ శ్రీవారి సేవకులతో భక్తులకు సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చెన్నై, హైదరాబాద్, వైజాగ్, కన్యాకుమారి, బెంగుళూరు వంటి ప్రాంతాల్లో ఉన్న శ్రీవారి ఆలయాల్లో మొదటివిడతగా శ్రీవారి సేవను ప్రారంభించాలన్నారు. అనంతరం మిగతా ఆలయాల్లో దశలవారీగా శ్రీవారిసేవను ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీపీఆర్వో రవిని ఆదేశించారు. ఈ సమీక్షలో ఐటీ జీఎం ఫణికుమార్ నాయుడు, బర్డ్ డైరెక్టర్ డాక్టర్ జగదీష్, స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్, పద్మావతి చిన్నపిల్లల ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నర్మద, అశ్విని సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమకుమారి, ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు దీక్షిత్, ఐఐఎం ప్రతినిధులు, రాష్ట్ర ప్లానింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- నేడు 2,62,385 మందికి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్వర్ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి జిల్లా అధికారులతో ఆయన వర్చువల్‌గా సమీక్షించారు. నిర్దేశిత సమయానికే పింఛన్లు అదించాలన్నారు. లబ్ధిదారులను ఇబ్బంది పెట్టేలా ప్రవర్తించినా, ఆలస్యంగా పంపిణీ చేసినా ఉపేక్షించేది లేదన్నారు. గత నెలలో పింఛన్లు ఆలస్యంగా పంపిణీ చేసిన వారికి షోకాజు నోటీసులు అందించామని గుర్తుచేశారు. జిల్లాలో 2,62,385 మంది పింఛనుదారులకు రూ.112 కోట్ల నగదు పంపిణీ చేయనున్నారు.

సీహెచ్‌వో సేవలు మరువలేనివి



సీహెచ్‌వోను సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

భాకరాపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండ లం భాకరాపేట పీహెచ్‌సీ సీహెచ్‌వో శేషుకుమారి సేవలు మరు వలేనివని వైద్యాధికారి తేజస్విని అన్నారు. భాకరాపేట పీహెచ్‌సీలో శేష కుమారి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీహెచ్‌వో మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడం ఒక పుణ్య కార్యమని, అది నా జీవితానికి అర్థాన్ని ఇచ్చిందన్నారు. ఉద్యోగం కేవలం వృత్తిగానే కాకుండా సేవాభాగంగా భావించాలన్నారు. ప్రతి దశలోనూ తనకు తోడుగా ఉన్న సహచర ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుబ్రహ్మణ్యం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అబ్బన్న కాలనీలో డ్రైనేజీ సమస్యకు మోక్షం



అబ్బన్న కాలనీలో యూజీడీఎస్ వ్యవస్థను పరిశీలిస్తున్న ఈ.ఈ తులసికుమార్

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక అబ్బన్న కాలనీ వాసులను 10 రోజులుగా ఇబ్బందిపెడుతున్న యూజీ డీఎస్ సమస్యకు కార్పొరేషన్ అధికారులు పరిష్కారం చూపారు. గంటలో పరి ష్కారం లభించింది. వీధిలోని యూజీడీఎస్ పొంగి రెండు అడుగుల ఎత్తు వరకు ప్రవ హిస్తోంది. మురికి నీటిలో రాకపోకలు సాగించలేక కాలనీవాసులు ఇబ్బంది పడ్డారు. స్థానికుల పిర్యాదు మేరకు.. మున్సిపల్ ఈఈ తులసికుమార్ శుక్రవారం రాత్రి వచ్చి సమస్యను పరిశీలించారు. కాలువలో అడ్డుగా పడి ఉన్న సిమెంటు దిమ్మెలను కార్మికుల సాయంతో తొలగించి, నీరు వేగంగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. కాలువలను, రోడ్లను శుభ్రం చేయించారు. కాలువలను ఆక్రమించి భవన నిర్మాణాలు చేపట్టడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఈఈ చెప్పారు.

ఉద్యోగాలకు ఎస్డీహెచ్ఆర్ విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల చైర్మన్ చక్రవర్తిరెడ్డి

తిరుపతిరూరల్, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): న్యూ బాలాజీ కాలనీలోని ఎస్డీహెచ్ఆర్ డిగ్రీ కళాశాలలో చదివే 310మంది విద్యార్థులు పలుసంస్థల ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఉష పేర్కొన్నారు. కళాశాలలో నిర్వ హించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో గ్లోలాజిక్ సంస్థలో 112మంది విద్యార్థులు, ఆల్‌సెట్‌కి 77మంది, ఎంఫసిస్‌కి 62మంది, ఆటోసెన్స్ సంస్థకి 59మంది విద్యార్థుల చొప్పున మొత్తం 310మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలి పారు. కాగా గ్లోలాజిక్ సంస్థకి ఎంపికైన 112మందికి రూ.6.2లక్షల వార్షికవేతనం ఉంటుందని తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ డీవీఎస్ చక్రవర్తిరెడ్డి అభినందించారు.

వ్యవసాయ సంఘాలు ఏర్పాటు చేసుకోవాలి



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం నాగేశ్వరరావు

తిరుపతిరూరల్, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): రూరల్‌మండల గ్రామాల పరిధిలోని మహిళా రైతులు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని మండల వెలుగు సమాఖ్య ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు పేర్కొన్నారు. తిరుపతిరూరల్ మండల మహిళాసమాఖ్య కార్యాలయంలో శుక్రవారం మహిళారైతులకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎఫ్‌పీవో అధ్యక్షురాలు జయలక్ష్మి, సీసీలు రమేష్, ధనుంజయ, రవి, చిత్ర, మహిళా రైతులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



సదరన్ డిస్కం సీఎండీ లోతేటి శివశంకర్‌ను 1104 యూనియన్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం, శాలువతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. - తిరుపతి (ఆటోనగర్)

ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా దినోత్సవం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి లోని ఎస్వీయూ స్టేడియంలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ ఐక్యతా దినోత్సవం నిర్వహించారు. ఎన్‌సీసీ నగర్ స్టేడియం వరకు ఎన్‌సీసీ క్యాడెట్లు, అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీగా చేరుకున్నారు. దేశ చిత్రపటాన్ని రూపొందించి.. అందులో జాతీయ జెండా చేబూని వలయాకా రంలో నిలబడి ఐక్యతా ప్రతిజ్ఞ చేశారు. తిరుపతి కమిషనరు మౌర్య, ఎన్‌సీ సీ గ్రూప్ కమాండర్ కల్నల్ సతీందర్ దహియా తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరి

ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం



చంద్రగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో ఏఐటీయూసీ 106వ ఆవి ర్భావ దినోత్సవాన్ని కార్మికులు ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా ఏఐటీ యూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరా ములు మాట్లాడుతూ 1920 అక్టోబరు 31న భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం సంఘం పోరా డిందని గుర్తుచేశారు. కార్మికుల హక్కులు, చట్టాలను సాధించి పెట్టిందని, కార్మికులకు కనీస వేతనాలు, పనిగంటలు, పని భద్రత కావాలని ఐక్యం చేసేం దుకు ఏఐటీయూసీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేవై రాజా, మండల నాయకులు రవిచంద్ర, రవి, బాలా, మణికంఠ, పరంధామ, రాజేంద్ర, అజిత్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఐక్యతకు పునాది వేసిన పటేల్



రాలీలో మాట్లాడుతున్న సీఐ ఇమ్రాన్ బాషా

భాకరాపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జాతీయ ఐక్యతకు సర్దార్ వల్లబాయ్ పటేల్ పునాది వేశారని భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా అన్నారు. భాకరాపేటలో జాతీయ సమైక్యత దినోత్సవం పురస్కరిం చుకుని 2కే రన్ ఫర్ యూనిటీ కార్యక్ర మాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర, ఎర్రావారి పాళెం ఎస్ఐ బాలకృష్ణ, స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ దస్తగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ఏఐటీయూసీ లక్ష్యం



మాట్లాడుతున్న ఏకేశ్వర రెడ్డి

భాకరాపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఏఐటీ యూసీ పనిచేస్తుందని తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఏకేశ్వర్‌రెడ్డి అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏఐటీ యూసీ జెండా ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు, ఉద్యోగుల సంక్షేమం కోసం బడుగు, బల హీనవర్గాల అభ్యున్నతి కోసం ఏఐటీ యూసీ పోరాడుతోందన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కోశాధికారి లోకయ్య నాయుడు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వీడిన వాన..వదలని నీరు

- పూడిపోయిన కాలువలు
- పొలాల్లో నిలిచిపోయిన నీరు
- మునకలో రహదారులు





సంజీవరాయపురం వద్ద పొలంలో చేరిన రాయలచెరువునీరు- ఆర్‌సీపురంలో ఇళ్ల ముందు ఉన్న నీరు

రామచంద్రాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తుపాను తగ్గినప్పటికీ వరద కాలువలు పూడిపోవ డంతో పలు పొలాలకు, గ్రా మాలకు వెళ్లే దారులన్నీ నీటితో నిండిపోయాయి. దీంతో రైతులు, ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం రాయల చెరువునీరు పొలాలకు వెళ్లేందుకు కట్ట నుంచి సంజీవ రాయపురం వరకు రాతికట్టడంతో పెద్దకా లువను కట్టారు. ఈ కాలువలో పూడిక ఏర్పడటంతో రాయలచెరువు నుంచి వచ్చే నీరు సంజీవరాయ పురం, బలిజపల్లి గ్రామ రైతుల పొలాల్లో నిలిచిపో యింది. మరో ఆరు నెలలు అయినా ఈ నీరు ఇలాగే ఉంటుంది. రైతులు కూడా ఎలాంటి వ్యవసాయ పనులు చేసుకోలేని పరిస్థితి. 20 ఏళ్లగా ఈ పరిస్థితి ఇలానే కొనసాగుతోంది. గంగిరెడ్డిపల్లి, తోకగుట్ట అడవి నుంచి వచ్చే వర్షపునీరు ఆర్‌సీపురం వంక వరకు వెళ్లేందుకు గతంలో చిన్న వంక ఉండేది. ఇది ఆక్రమణతో పాటు పూడిక ఏర్పడటంతో వర్షపునీరు రోడ్డుపై సాగుతోంది. రెండు రోజుల క్రితం ఆర్‌అం డ్‌బీ అధికారులు ఆర్‌సీపురం మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ వరకు వర్షపునీరు వెళ్లేందుకు కాలువ తీశారు. అయితే అక్కడి నుంచి కాలువ తీసే పరి స్థితి లేకపోవడంతో అలాగే వదిలేశారు. దీంతో ఒక వీధిలో వర్షపునీరు ఇళ్ల మధ్యనే నిలిచిపోయింది. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. చుట్టూ పొలాలు ఉండ టంతో వరదనీటిలో పాములు చేరుతున్నాయి. ఈ నీటిని బయటకు తరలించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేసీపేటలో భూసర్వే పరిశీలన



సర్వేయర్ ద్వారా వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్

తిరుపతిరూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కేసీపేటగ్రామంలో చేపడుతున్న భూసర్వేని రూరల్ తహసీల్దార్ రామాంజులనాయక్ పరిశీలించారు. మం డల సర్వేయర్ హేమకుమార్‌ని అడిగి సర్వే చేప డుతున్న నంబర్ల వివరాలను ఆరా తీశారు. రైతులు సర్వే అధికారులకు అందించి సహకరించాలని కోరారు. సర్పంచ్ పిపాసి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

కేసీపేట గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామసర్పంచ్ పిపాసి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తహసీల్దార్ రామాంజులనాయక్ మాట్లాడారు. పౌర హక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

4న సాంస్కృతిక పోటీలు

తిరుపతి అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): వివేకా నంద జయంతి సందర్భంగా ఈనెల 4వ తేదీన బాలాజీ కాలనీ, నరసింహతీర్థం రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో సాంస్కృతిక పోటీలు నిర్వహించనున్నట్లు సె ట్విన్ సీఈవో పి.యశ్వంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జానపద నృత్యాలు, జానపద గీతం, కవిత్వం, కథలు రావయం, పెయింటింగ్ వంటి విభాగాలలో పోటీ లు ఉంటాయని వివరించారు. 15నుంచి 25సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 0877-2286921, 8341111687లను సంప్రదించాలని కోరారు.

దేశ ఐక్యతకు ఉక్కు సంకల్పం



చంద్రగిరిలో విద్యార్థులు, అధికారులు చేపట్టిన ర్యాలీ

చంద్రగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భారత మాజీ హోమ్ మంత్రి భారతరత్న అవార్డు గ్రహీత సర్దార్ వల్లాబాయ్ పటేల్ దేశ ఐక్యతకు ఉక్కు సంకల్పం తీసుకున్నారని చంద్రగిరి సీఐ సురేష్‌కుమార్ కొని యాడారు. పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్స వాలు, సర్దార్ వల్లాబాయ్ పటేల్ జయతిని పురస్కరిం చుకుని ఏక్తా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ భారత దేశ ఐక్యత కోసం దేశంలోని సంస్థానాలను విలీనం చేయడంలో వల్లబాయ్ పటేల్ కృషి మరువలేనిదన్నారు. ఏక్తా దివస్ పురస్కరించుకుని నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు, అధికారులు, టీడీపీ నాయకులు చంద్రగిరి జాతీయ రహదారి నుంచి పట్టణం లోని టవర్ క్లాక్ వరకు వందేమాతరం నినాదాలతో 2కే రన్ నిర్వహించారు. మానవహారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో తహ సీల్దార్ శివరామసుబ్బయ్య, ఎస్ఐలు అనిత, రవీంద్ర నాయక్, మురళీమోహన్, టీడీపీ మండలాధ్యక్షుడు బాలకృష్ణమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామచంద్రాపురం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఆర్‌సీపురంలో శుక్రవారం పోలీసుల ఆధ్వర్యంలో సర్దార్‌వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకలు, ఐకత్య పరుగు, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఎస్ఐ భక్తవత్సలం మాట్లాడుతూ సర్దార్ వల్లబాయ్ పటేల్ దేశ రక్షణ, సమగ్రత కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది రాజశేఖర్, వెంకటేష్, మహేష్, రాజేష్‌బాబు, ధనంజయులు, ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంపై శిక్షణ



వంట మనుషులతో మాట్లాడుతున్న విక్రమ్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లా సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లోని వంట మనుషులకు ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ వారు పోషక విలువలతో కూడిన ఆహారంపై శిక్షణ ఇచ్చారు. ఐదు రోజులపాటు శిక్షణ ఇచ్చినట్లు జిల్లా సాంఘిక సంక్షే మాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శిక్షణ పొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఎయిర్ ఎన్‌సీసీ దత్తతకు పేరూరు



పేరూరులో స్వచ్ఛత అభియాన్‌పై అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు

తిరుపతిరూరల్, అక్టోబరు31 (ఆంధ్ర జ్యోతి): తిరుపతిరూరల్ మండల పేరూరు గ్రామాన్ని మహా స్వచ్ఛత అభియాన్‌లో భాగంగా 11(ఏ)ఎయిర్ ఎన్‌సీసీ క్యాడెట్స్ దత్తత తీసుకున్నారు. సామాజిక బాధ్య తగా శుక్రవారం గ్రామంలో పర్యటించి వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై ప్రజల్ని చైతన్యపరిచారు. రోడ్లపై చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిం చారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాటా డుతూ స్వచ్ఛభారత్ పరిశుభ్రత డ్రైవ్, మొక్కల పెంపకం, విద్య, ఆరోగ్యం, పరి శుభ్రత, పర్యావరణ రక్షణ వంటి అవగా హనా కార్యక్రమాలు గ్రామంలో చేపడుతామని పేర్కొన్నారు.

తాగునీరు ఇప్పించండి



సమావేశానికి హాజరైన స్థానికులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యో తి): ఊరు ఏర్పడినప్పటి నుంచి తమకు తా గునీరు, డ్రైనేజీలు లేవని, పలుమార్లు అధికా రుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేకపోయిం దని ఉల్లిపట్టెడ హరిజనవాడ వాసులు ఆవే దన వ్యక్తం చేశారు. శుక్రవారం సాయంత్రం అర్బన్ తహసీల్దార్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఉల్లిపట్టెడ హరిజనవాడలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తా ము ఎదుర్కొంటున్న సమస్యలను అధికారు ల దృష్టికి తెచ్చారు. డీటీ రామచంద్ర, యూ నివర్సిటీ ఎస్ఐ కృష్ణయ్య, మున్సిపల్ అధికా రులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ కళాశాలల్లో విద్యా కమిటీ పర్యటన



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): టీటీడీ పాలకమండలి విద్యా కమిటీ శుక్రవారం టీటీడీ విద్యా సంస్థలను సందర్శించింది. పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, పనబాక లక్ష్మి, టీటీడీ విద్యా శాఖ, ఇంజనీరింగ్ అధికారులు శ్రీ పద్మావతి డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళా శాలలను సందర్శించారు. అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ సీట్ల పెంపు సాధ్యా సాధ్యాలను పరిశీలించారు. అనంతరం పద్మావతి అతిథి గృహంలో విద్యా కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అందుతున్న విద్య, వైద్య సదుపాయాలు, సిబ్బంది లభ్యత, స్పోర్ట్స్, గేమ్స్, హాస్టల్ విద్యార్థులకు వేడి నీటి సౌకర్యం, ఎంట్రెన్స్ పరీక్షలు, పోటీ పరీక్షలకు శిక్షణ, మొదలైన వాటిపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో టీటీడీ విద్యాశాఖ అధికారి టి.వెంకట సునీలు, ఇంజనీరింగ్ విభాగానికి చెందిన మనోహర్, ప్రసాద్ పాల్గొన్నారు.

భక్తుడికి బ్రాస్‌లెట్ అప్పగింత



బాధితుడికి బ్రాస్‌లెట్ అందజేస్తున్న సీఐ సునీల్‌కుమార్

తిరుచానూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చిన ఓ భక్తుడు తిరుచా నూరులోని ఓ హోటల్లో పోగొట్టుకున్న బ్రాస్‌లెట్‌ను తిరిగి అప్పగించారు. తిరుచానూరు సీఐ సునీల్ కుమార్ వివరాల మేరకు... తూర్పు గోదావరి జిల్లాకు చెందిన హేమాద్రి తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చి, తిరుచానూరు పరిధిలోని ఓ హోటల్‌లో బస చేశాడు. అక్కడ బ్రాస్‌లెట్‌ను జారవిడుచుకున్నాడు. అదే హోటల్‌లో బసచేసిన బెంగళూరుకు చెందిన రేఖ కుటుంబ సభ్యులు దాన్ని గమనించి తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు హేమాద్రి వివరాలు కనుక్కొని 20 గ్రాముల బంగారు బ్రాస్‌లెట్‌ను తిరిగి అందజేశారు.

నిబంధనల మేరకు భవన నిర్మాణాలు

- వర్క్‌షాప్‌లో ఎమ్మెల్యే, కమిషనర్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య

తిరుపతి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభు త్వ నిబంధనల మేరకు నగరంలో భవన నిర్మా ణాలు చేపడితే శక్తి వినియోగం తగ్గుతుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కచ్చపి ఆడిటోరియంలో విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ బృందం తిరుపతిలో జోనింగ్ నియమాలు - శక్తి సామర్థ్య అధ్యయ నంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఇన్‌చార్జ్ జేసీ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ముఖ్య అతిథులుగా హాజర య్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిరుపతి నగ రంలో శక్తి వినియోగం ఏ మేరకు జరుగుతుందనే విషయంపై స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటె క్చర్ బృందం సర్వే నిర్వహించారని తెలిపారు. నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేయడం వలన శక్తి వినియోగం ఎక్కువవుతోందన్నారు. మౌర్య మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు భవన నిర్మాణాలు సాగిస్తే శక్తి విని యోగం తగ్గి పర్యావరణానికి ఎంతో మేలు జరు గుతుందని తెలిపారు. అనంతరం వర్క్‌షాప్ కర పత్రాలను ఆవిష్కరించారు. తుడా కార్యదర్శి డాక్టర్ శ్రీకాంత్ బాబు, డిప్యూటీ కమిషనర్ అమ రయ్య, తుడా సీపీవో దేవికుమారి, నగరపాలక సంస్థ ఏసీపీలు మూర్తి, మధు, మునిసిపల్, తుడా అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్తీక మాస వన విహార ఆహ్వానం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): కార్తీక మాస వనవిహార మహోత్సవానికి ఆహ్వానిస్తున్నట్లు కార్తీక సంధ్య అకాడమీ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ఆదివారం తొండవాడ అగస్త్యేశ్వరస్వామి ఆలయ నటరాజ మండపం వెనుక నారాయణి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పూజలు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, గోల్డ్‌కాయిన్ బంపర్ డ్రా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆర్యవైశ్యులు కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బండకుర్తి నరసింహులు, శ్రీనివాసులు, సురేష్, శ్యామ్‌సుందర్, మధుసూదన్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ, పటేల్‌కు ఘన నివాళి



ఇందిరాగాంధీ, సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి, మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతలు వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. దేశాభివృద్ధికి వారు చేసిన సేవలను కాంగ్రెస్ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్య క్షుడు దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట నరసింహులు, నేతలు లోకేష్, ప్రేమ్‌సాగర్, హసీనా తదితరులు పాల్గొన్నారు.

'కార్పొరేషన్ స్థలం కబ్జాకానివ్వం'

తిరుపతి, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 36వ డివిజన్లో నగరపాలక సంస్థకు చెందిన విలువైన స్థలాన్ని కబ్జా కానివ్వమని వివిధ రాజకీయ పార్టీ నేతలు స్పష్టం చేశారు. 'కార్పొరేషన్ స్థలంపై కన్ను' శీర్షి కన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం అటు రాజకీయ పార్టీల్లో, ఇటు కార్పొరేషన్లో కలవరం రేపింది. వైసీపీ నాయకులు స్థలం వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. కబ్జా కాకుండా కాపాడాలని నినా దాలు చేశారు. అదేవిధంగా కూటమి నాయకులు ఆముదాల తులసీరాం, ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, ఆము దాల వెంకటేష్, కుడితి సుబ్రమణ్యం, ఆముదాల గిరి, బెల్లంకొండ సురేష్, తిరుమల రాయల్, వంకదార రామ్మోహన్, శేషాద్రి, యాసిన్ భాష, అన్సర్, బాలాజీ, తోట జయంతి, చందన తదితరులు వైసీపీ నాయకుల ఆరోపణలపై మండిపడ్డారు. స్థలం అన్యాక్రాంతం కాకుండా కూటమి నాయకులు కాపుకాస్తారన్నారు. కాగా కార్పొరేషన్ స్థలానికి సమీపంలో పాడైన భవనం గోడలను తొలగించేందుకు యజమాని వెంకటముని ఎక్సకవేటర్‌ను తీసుకెళ్లి కార్పొరేషన్ గోడను తొలగించి పనులు చేసుకున్నారని మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధి కారి మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో మౌఖికంగా కోరారని, ఆ మేరకు పనులు చేస్తున్నార న్నారు. పనులు పూర్తయ్యాక ప్రహరీ గోడను పునర్నిర్మి స్తారని చెప్పారు. అయితే ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిన తర్వాత పక్కన స్థల యజమాని ఆర్జీ పెట్టుకు న్నారని ప్రకటనలో పేర్కొనడం గమనార్హం.

'పరకామణి కేసుకు.. భానుప్రకాష్‌రెడ్డికి సంబంధం లేదు'

తిరుపతి(ఎంఆర్‌పల్లె), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసుకు టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాస్ రెడ్డికి ఎలాంటి సంబంధమూ లేదని సాధు పరిరక్షణ సమితి అధ్యక్షుడు శివానందస్వామి అన్నారు. శుక్ర వారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దేశవ్యా ప్తంగా సంచలనంగా మారిన పరకామణి కేసుకు మాచర్ల శ్రీనివాసులు కారణమన్నారు. దీనిపై గత ఏడాది ఈవోకు పిర్యాదు చేశారన్నారు. ఆయన పట్టిం చుకోకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాడన్నారు. కాగా కేసు వేసింది ఒకరు.. ఫలితం దక్కించుకుందని మరొకరని తెలిపారు. కేసు వేసిన తర్వాత మాచర్ల శ్రీని వాసులుపై 4 అక్రమ కేసులు పెట్టి బెదిరించారన్నారు. కానీ భానుప్రకాష్‌రెడ్డి తనకు బెదిరింపు కాల్స్ వస్తున్నా యని చెబుతున్నాడన్నారు. పోరాటం చేసిన వ్యక్తికి కాకుండా ఆయనకు ఎందుకు వస్తున్నాయో అర్థం కావడం లేదన్నారు. దీన్ని మీడియాకు తెలియజేయ డమే తమ ముఖ్య ఉద్దేశమన్నారు. మాచర్ల శ్రీనివా సులు, కృష్ణమూర్తి, సుకుమార్ పాల్గొన్నారు.

తిరుచ్చిపై పద్మావతిదేవి అభయం



తిరుచానూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మ వారికి శుక్రవారం తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు చేశారు. మూలవర్లకు నేత్రపర్వంగా అభిషేకం చేశారు. మధ్యాహ్నం అమ్మవారి ఉత్సవ మూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం సర్వాలంకార శోభితురాలైన అమ్మవారిని తిరుమాడ వీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు పాల్గొన్నారు.

ట్రెండ్స్ పాఠశాలలో బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభం



బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘువంశీ

తిరుపతి(క్రీడలు), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మంగళంలోని ట్రెండ్స్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన బ్యాడ్మింటన్ కోర్టును అసిస్టెంట్ కలెక్టర్ సందీప్ రఘువంశీ శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి ఈ స్థాయికి ఎదిగానని గుర్తు చేశారు. మంచి మార్కులు వచ్చే దిశగా కష్టపడి చదవాలని పిల్లలకు సూచించారు. గతేడాది బేస్‌బాల్ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న రమ్య, తోఫిక్, అజిత్, భావనను అభినందించి, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎంవో సురేష్, అర్బన్ మండల ఎంఈవో భాస్కర్‌నాయక్, ప్రిన్సిపాల్ భాస్కర్‌నాయుడు, పీడీలు సాంబశివరావు, సురేష్ పాల్గొన్నారు.

తిరుపతిలో ఫ్యాషన్ జూనియర్స్ శిక్షణ



ఫ్యాషన్ జూనియర్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలో తొలిసారిగా ఫ్యాషన్ జూనియర్స్ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకురాలు రాధిక తెలిపారు. ఖాదీ కాలనీలోని వన్ అండ్ ఓన్లీ ఫ్యాషన్ జూనియర్స్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పెద్ద నగరాల్లో మాత్రమే ఉన్న ఫ్యాషన్స్ జూనియర్స్ శిక్షణను తిరుపతిలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. బాల్యంలోనే టాలెంట్‌ను వెలికితీయడానికి, తెరంగేట్రం చేయడానికి ఇదొక చక్కటి అవకాశమన్నారు. 4 నుంచి 19 సంవత్సరాల బాలబాలికలు పాల్గొనవచ్చునని, శనివారం నుంచి రిజిస్ట్రేషన్స్ జరుగుతాయని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9959777295ను సంప్రదించాలని కోరారు. డాక్టర్ ప్రకాష్, నవీన్ పాల్గొన్నారు.

శిశుగృహంలో అనాథ పిల్లలకు ఆశ్రయం



మీడియాతో లక్ష్మీకుమారి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్థాపించిన శిశుగృహంలో 0-6 అనాథ పిల్లలను చేర్చుకోనున్నట్లు ఐసీడీఎస్ శిశుగృహ మేనేజరు లక్ష్మీకుమారి తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడుతూ తల్లిదండ్రులు వదిలేసిన, పోషించలేని పిల్లలను శిశుగృహంలో చేర్చుకుంటున్నామన్నారు. పురిటి బిడ్డలను చంపకుండా శిశుగృహంలో అప్పగించాలని కోరారు. ఇందుకోసం ఆస్పత్రులు, బస్టాండు, రైల్వేస్టేషన్ల వద్ద ఏర్పాటు చేసిన ఊయలల్లో పిల్లలను ఉంచాలన్నారు. మరిన్ని వివరాలకు 9494302127ను సంప్రదించాలని కోరారు.

అభినందన



పేటశ్రీని అభినందిస్తున్న వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ తెలుగు రిటైర్డు ప్రొఫెసర్ పేట శ్రీనివాసులు రెడ్డిని వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు అభినందించారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఈ నెల 29వ తేదీన వచన సాహిత్య పురస్కారం స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులు శాలువాతో సత్కరించి, అభినందించారు.









ప్రహరీ అడుగు భాగంలో ఏర్పడిన కలుగులు, రంధ్రాలు

పాఠశాల ఆవరణలో నిల్వ ఉన్న వర్షపు నీరు - కూలిపోయిన ప్రహరీ



వాడకుండా మూసేసిన మరుగుదొడ్డి

సమస్యల 'కొలను'లో పాఠశాల..!

వర్షం వస్తే చుట్టూ నిలుస్తున్న నీరు - శిథిలావస్థకు చేరిన భవనం
బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్న విద్యార్థులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): స్థానిక చింతలచేనులోని నగరపాలక ప్రాథమిక పాఠశాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. చుట్టూ భవనాలు, రోడ్లు ఏర్పడటంతో రెండు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ పాఠశాల ఆవరణ ఎత్తు బాగా తగ్గిపోయింది. దీంతో వర్షం కురిసిన ప్రతిసారీ ఆవరణలోకి నీరు చేరుతోంది. నాలుగు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు నీటి నిల్వ పెరిగి తరగతి గదుల్లోకి చేరాయి. అక్కడున్న అంగన్‌వాడీ వర్కర్ అప్రమత్తమై శుభ్రపరిచింది. పాచిపట్టి దుర్వాసన వస్తోంది. ప్రహరీ గోడ కూలి ఏడాది కావస్తోంది. మరుగుదొడ్లలో వ్యర్థాలు పేరుకుపోయాయి. వాటిని ప్రస్తుతం వాడటం లేదు. ప్రహరీకి అడుగులో భాగంలో ఎలుకలు కలుగులు పెట్టేయడంతో విష పురుగులు ప్రవేశిస్తున్నాయి. పాఠశాల పై అంతస్తుకు ఏర్పాటు చేసిన మెట్లకు బీటలు వారాయి. భవనం రంగులు వెలసిపోయి కళావిహీనంగా మారిపోయింది. విద్యుత్ మీటర్‌ను తక్కువ ఎత్తులో అమర్చడం, కరెంట్ కేబుల్స్ వేలాడుతుండటం కలవరపెడుతోంది. ఇన్ని సమస్యల మధ్య పిల్లలు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. మున్సిపల్, విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాలకు మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైన ఉంది.



చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ మీటర్, వేలాడుతున్న వైర్లు

8 గంటల పనికోసం పోరాటాలకు సిద్ధంకండి

సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి



ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న మురళి

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేసిన 8 గంటల పని విధానాన్ని తిరిగి సాధించుకునేందుకు పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి కోరారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఆటోనగర్‌లో గుజిరీ వ్యాపారుల సంఘం అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్మిక పతాకాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. కార్మికుల హక్కులను కాలరాసేలా ప్రస్తుత ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని తెలిపారు. దీన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఏఐటీయూసీ ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి.పెంచలయ్య, గుజిరీ వ్యాపారుల సంఘం జిల్లా కార్యదర్శి అల్లాబక్ష్, ఆటో యూనియన్ నాయకులు శివ, నాగభూషణం, శ్రీరాములు, మున్నా, గురప్ప పాల్గొన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఏఐటీయూసీ నాయకులు కార్మిక పతాకాలను ఆవిష్కరించారు.

విద్యాసామగ్రి పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు ఇస్తున్న ఆర్గనైజేషన్ నిర్వాహకులు

తిరుపతి (కల్చరల్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : స్థానిక మల్లంగుంట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం స్వహస్త ఆర్గనైజేషన్ 11వ వార్షికోత్సవం సందర్భంగా విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. 25 మంది విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, స్టేషనరీ అందించారు. 51 మంది విద్యార్థులకు విద్యాభ్యాస సామగ్రిని అందించారు. ఉపాధ్యాయులు మధుసూదన్‌రాజు, సురేఖ, సుబ్రహ్మణ్యం, స్వహస్త ఆర్గనైజేషన్ సభ్యులు సుకుమార్, చైతన్య, ప్రణీత్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం



దేవనాథన్‌ను సత్కరిస్తున్న అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీలో ఉద్యోగ విరమణ పొందిన బోధన, బోధనేతర ఉద్యోగులను అధికారులు సన్మానించారు. విశిష్టాద్వైత విభాగాధ్యక్షులు కేఈ దేవనాథన్, నాన్ టీచింగ్ ఉద్యోగులు అప్సర్, మురళిని వీసీ కృష్ణమూర్తి, రిజిస్ట్రార్ వెంకటనారాయణ సన్మానించారు. యూనివర్సిటీకి వారు అందించిన సేవలను కొనియాడారు.

డాక్టరేట్ ప్రదానం



నాగకృష్ణమయూరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ లైబ్రరీ సైన్స్ పరిశోధకురాలు ఎ.నాగకృష్ణమయూరి డాక్టరేట్ పొందారు. అవేర్నెస్ అండ్ యూజ్ ఆఫ్ ఐసీటీ బేస్డ్ రీసోర్సెస్ అండ్ సర్వీస్ అమాంగ్ ద రీసెర్చ్ స్కాలర్స్ ఆఫ్ ఎస్వీ యూనివర్సిటీ అండ్ జేఎన్‌యూ-న్యూఢిల్లీ - ఎ స్టడీ అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించారు. ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు పర్యవేక్షకులుగా వ్యవహరించారు. నాగకృష్ణమయూరి పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఈమె రూపొందించిన పరిశోధనా వ్యాసాలు ప్రముఖ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయని సీఈ రాజమాణిక్యం తెలిపారు.

తుఫాన్ బాధితులకు పరిహారం పెంచండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన బాధితులకు నష్టపరిహారం పెంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. తుఫాన్ కారణంగా తీవ్రమైన నష్టం జరిగిందని, బాధితులకు రూ.5 వేలు పరిహారం ఇవ్వాలని అన్నారు. నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలన్నారు. సీపీఎం నగర కార్యదర్శి వేణుగోపాల్ పాల్గొన్నారు.

కార్మికులకు శాపంగా పెట్టుబడిదారీ వ్యవస్థ



సదస్సులో మాట్లాడుతున్న జనార్దన్

తిరుపతి(ఆటోనగర్), అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పెట్టుబడిదారి వ్యవస్థ కార్మిక లోకానికి శాపంగా మారిందని సోషియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వి.జనార్దన్ పేర్కొన్నారు. తిరుపతి బైరాగిపట్టెడలో శుక్రవారం ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలో పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సదస్సులో 21వ శతాబ్దంలో పెట్టుబడిదారి వ్యవస్థ-పాలకులు అనుసరిస్తున్న విధానాలు-కార్మికులు, సంఘాలు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జనార్దన్ మాట్లాడుతూ పెట్టుబడిదారులు పాలకులతో కలిసి కార్మికుల హక్కులను హరించే విధంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మికులు పోరాటాలు చేసి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి ఏఐటీయూసీ ఆవిర్భావం, చేసిన పోరాటాలను వివరించారు. సీపీఐ నేతలు ఎ.రామానాయుడు, పి.మురళి, సి.పెంచలయ్య, ఏఐటీయూసీ నేతలు చంద్రశేఖర్ రెడ్డి, రాధాకృష్ణ, ఎన్‌డీ రవి పాల్గొన్నారు.

భారతీయ సంస్కృతిని పరిరక్షించాలి



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి) : భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రిటైర్డ్ అధ్యాపకురాలు రమాదేవి కోరారు. తిరుపతి రైల్వే కాలనీలోని సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో శుక్రవారం జరిగిన సప్తశక్తి సంఘం కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ గురించి వివరించారు. విద్యాభారతి అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ పిలుపు మేరకు కోటి మంది మాతృమూర్తులను జాగృతం చేయాలనే సంకల్పంతో సప్తశక్తి సంఘం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పాఠశాల సమితి ఉపాధ్యక్షురాలు సరళ తెలిపారు. ఆ మేరకు అక్టోబరు 5వ తేదీ రాణిదుర్గావతి జయంతి సందర్భంగా ప్రారంభమైన ఈ సప్తశక్తి సంఘం కార్యక్రమం 2026 జనవరి 23వ తేదీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వరకు జరుగుతుందని చెప్పారు. అనంతరం రాణిరుద్రమదేవి వేషధారణలో విద్యార్థినుల కళా ప్రదర్శన అలరించింది. పాఠశాల సమితి కోశాధికారి భారతి, ప్రశాంతిరాజు పాల్గొన్నారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త అవసరం

యూనియన్ బ్యాంక్ భద్రతాధికారి పార్థసారథి చౌదరి



మాట్లాడుతున్న యూనియన్ బ్యాంక్ అధికారి పార్థసారథి చౌదరి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు గురి కాకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని యూనియన్ బ్యాంక్ చీఫ్ ఇండ్రోక్యూషన్ సెక్యూరిటీ ఆఫీసర్ పార్థసారథి చౌదరి కోరారు. ఎస్వీ యూనివర్సిటీ సైన్స్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సెల్‌ఫోన్ వాడే ప్రతి ఒక్కరూ సెక్యూరిటీ వైరస్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. తెలియని నంబర్ల నుంచి వచ్చే కాల్స్, మెసేజ్‌లకు స్పందించరాదన్నారు. తెలియని వ్యక్తులు ఫోన్ ద్వారా వివరాలు అడిగితే చెప్పకూడదన్నారు. ఈ మెయిల్, వాట్సాప్‌కు వచ్చే ఎలాంటి లింక్స్‌ను క్లిక్ చేయరాదని సూచించారు. బ్యాంక్ అకౌంట్ వివరాలు ఎవ్వరికీ చెప్పకూడదన్నారు. యూనియన్ బ్యాంక్ డీజీఎం అభిమన్యు కుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైన వారు 1930 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం అందించాలన్నారు. సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఓవీఎస్ రెడ్డి, ఫిజిక్స్ విభాగాధిపతి దేవప్రసాదరాజు, అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏఐ సాయంతో బోధన

ఎఫ్‌డీపీ వర్క్‌షాప్‌లో నిపుణుల సూచన



కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏఐని బోధన అవసరాల కోసం ఉపయోగించుకోవాలని అధ్యాపకులకు పలువురు నిపుణులు సూచించారు. పద్మావతి యూనివర్సిటీలో రెండు రోజులుగా బోధనలో ఏఐ సహకారం అంశంపై అధ్యాపకులకు వర్క్‌షాప్ నిర్వహించారు. మద్రాసు ఐఐటీ ప్రొఫెసర్ సుగన్య, తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్లు సక్తియ నారాయణన్, కలిదాస్ తదితరులు మాట్లాడారు. ఏఐని ఉపయోగించి పాఠ్య ప్రణాళికను రూపొందించవచ్చన్నారు. గూగుల్ మీట్ ద్వారా ఆన్‌లైన్ తరగతులు నిర్వహించుకోవచ్చన్నారు. ఆలోచనలను ప్రదర్శించడానిని, విషయ విశ్లేషణకు కూడా ఏఐ ఉపయోగపడుతుందని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న అధ్యాపకులకు డీన్ వాణి సర్టిఫికెట్లు అందజేశారు.

వెంకటగిరిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను వైసీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్య, వైద్యం, మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు వెంకటగిరిని రెవెన్యూ డివిజన్ చేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు.



పోలీసుల సమైక్యతా పరుగు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యాన సమైక్యతా పరుగు (రన్ ఫర్ యూనిటీ) తీశారు. పోలీసు పరేడ్ మైదానం నుంచి ఎంఆర్‌పల్లె సర్కిల్ వరకు విద్యార్థులు, పోలీసులు, నగర ప్రజలతో ర్యాలీ నిర్వహించారు. అంతకు ముందు పటేల్ చిత్ర పటానికి అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, నాగభూషణరావు, శ్రీనివాసరావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దేశమంతా ఒక్కటే అనే భావనను ప్రజల్లో పెంపొందించడమే ఈ ర్యాలీ ఉద్దేశమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు.

→ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

రుయాలో 152 మందికి షోకాజు నోటీసులు

తిరుపతి(వైద్యం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని రుయాస్పత్రిలో పారిశుధ్యం, సెక్యూరిటీ, పెస్ట్ కంట్రోల్లో పనిచేసే 152 మందికి సూపరింటెండెంట్ రాధ శుక్రవారం షోకాజు నోటీసులు జారీ చేశారు. వీరు ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిజేషన్ సిస్టం)లో హాజరు సకాలంలో వేయకపోవడాన్ని ఆమె గుర్తించి వారికి నోటీసులు జారీ చేశారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు సకాలంలో వేయని వారిపై చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు ఆధారంగానే జీతాలు అందుతాయని లేకపోతే ఆ రోజుటి జీతం అందదన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 19 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 3 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.48 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 56,078

తలనీలాలు సమర్పించినవారు: 17,539



ముక్కంటికి బంగారు కాసుల దండ వితరణ

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరస్వామికి శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ఇందిర రూ.9.32లక్షల విలువైన 96గ్రాముల బంగారు కాసుల దండ, 650గ్రాముల వెండి బిందెను వితరణ చేశారు. వీటిని ఈవో బాపిరెడ్డి స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. వారికి స్వామిఅమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు.



ఈవో బాపిరెడ్డికి బంగారు కాసుల దండ అందజేస్తున్న ఇందిర

కొండెక్కుతూ.. భజనలు చేస్తూ..

● ఘనంగా శ్రీవారి మెట్లోత్సవం



పాదాల మండపం వద్ద పూజలు నిర్వహిస్తున్న టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతి అలిపిరి పాదాల మండపం వద్ద శుక్రవారం శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం ఘనంగా జరిగింది. పాదాల మండపం వద్ద పూజలు చేసి, కర్పూర హారతులిచ్చారు. పూర్వం నుంచీ ఎందరో మహనీయులు మెట్లమార్గంలో తిరుమల వెళ్లారని.. ఇలాంటి మెట్లోత్సవంలో పాల్గొనడం పుణ్యఫలంగా భావిస్తున్నట్లు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. భజన మండలి సభ్యులతో కలిసి గోవిందనామ భజనలతో సప్తగిరులను అధిరోహిస్తున్నట్లు దాస సాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు చెప్పారు. 3,500 మంది భజన మండలి సభ్యులతో కలిసి మెట్ల మార్గం గుండా తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు.



భజన మండలి కళాకారులు

శ్రీవారిసేవలో ప్రముఖులు



అతుల్ సింగ్

తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ ఏసీబీ డీజీ అతుల్ సింగ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఉన్నారు.

-తిరుమల, ఆంధ్రజ్యోతి

డ్రంకెన్ డ్రైవ్‌లో 41 మందికి జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులో 41 మందికి జరిమానా విధిస్తూ తిరుపతి మూడవ అదనపు జ్యుడిషియల్ కోర్టు న్యాయమూర్తి సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడుపుతున్న దాదాపు 70 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిలో 41 మందిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ట్రాఫిక్ కు అంతరాయం కలిగించిన 12 మందికి రూ.500 వంతున జరిమానా విధించారు.

గుంపులుగా వెళ్లండి

● శ్రీవారిమెట్టు మార్గంలో మరోసారి చిరుత కలకలం

చంద్రగిరి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురం నుంచి తిరుమలకు కాలినడకన వెళ్లే శ్రీవారిమెట్టు మార్గంలో చిరుత సంచారంతో కలకలం రేగింది. శుక్రవారం ఉదయం 150వ మెట్టు వద్ద అటవీ ప్రాంతంలోకి చిరుత దాటుతుండగా భక్తులు చూసి భయాందోళనకు గురై కేకలు వేయడంతో పారిపోయింది. అనంతరం భక్తులు టీటీడీ సెక్యూరిటీకి సమాచారమిచ్చారు. టీటీడీ సెక్యూరిటీ అప్రమత్తమై భక్తులను గుంపులు గుంపులుగా తిరుమలకు అనుమతించారు. చిన్న పిల్లలను జాగ్రత్తగా తీసుకెళ్లాలని సూచించారు. అటవీ అధికారులు ఆప్రాంతంలో ప్రత్యేక ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి, పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. గతంలోనూ 2024 సెప్టెంబరులో, ఈ ఏడాది జూన్‌లోనూ ఈ మార్గంలో చిరుత సంచరించింది. ఈనేపథ్యంలో చిన్న పిల్లలున్న భక్తులను మధ్యాహ్నం 2 గంటల వరకే శ్రీవారి మెట్టు మార్గంలో అనుమతిస్తున్నారు. టీటీడీ అధికారులు శ్రీవారిమెట్టు మార్గంలో కాలినడకన తిరుమలకు వెళ్ళే భక్తులు తగిన జాగ్రత్తలు తీసుకుని, అప్రమత్తంగా ఉండాలంటూ సూచిస్తున్నారు.



మూడు కేసుల్లో ఏడుగురికి

● ఇప్పటిదాకా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉరిశిక్ష విధిస్తూ తీర్పులు



స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి చిత్తూరు జిల్లా చరిత్రలో ఒకేసారి ఐదుగురికి ఉరి శిక్ష పడిన ఘటనగా కఠారి మోహన్ దంపతుల కేసు నిలిచిపోతుంది. దీంతో కలిపి ఇప్పటి వరకు మూడు కేసుల్లో ఉరిశిక్ష విధిస్తూ న్యాయమూర్తులు తీర్పులిచ్చారు.

2020 ఫిబ్రవరి 24:

కురబలకోట మండలం అంగళ్లలో ఓ పెళ్లికి వచ్చిన ఆరేళ్ల చిన్నారిపై లారీ క్లీనర్ పఠాన్ మహ్మద్ రఫీ(27) అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి మృతి చెందింది. 2019 నవంబరు 7న జరిగిన ఈ ఘటనపై చిత్తూరు కోర్టు ఉరిశిక్ష విధించింది. దీనిని హైకోర్టును జీవిత ఖైదుగా మార్చడంతో నిందితుడు కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు.

2023 ఆగస్టు 22:

తంబళ్లపల్లె మండలం ఏటిగడ్డ తాండాకు చెందిన తల్లీ కూతుళ్లతో వివాహేతర సంబంధం పెట్టుకుని హతమార్చడం.. ఓ బాలికపైనా అత్యాచారానికి పాల్పడిన కేసులో మదనపల్లె ఫస్ట్ ఏడీజే కోర్టు మౌలాలికి ఉరిశిక్ష విధించింది. నిందితుడు హైకోర్టుకు అప్పీలు చేయగా విచారణ పెండింగులో ఉంది.

అంత ఈజీ కాదు!

సాధారణంగా జిల్లా కోర్టులు విధించే ఉరిశిక్షలకు హైకోర్టు ఆమోదం తప్పనిసరి. ఆలోపు నిందితులు హైకోర్టుకు అప్పీలు చేసుకోవచ్చు. దీనిపై హైకోర్టు విచారించి మెరిట్స్‌ను బట్టి కింది కోర్టు వేసిన శిక్షను ఖరారు చేయచ్చు. లేదా జీవిత ఖైదుగా మార్చవచ్చు. మెరిట్స్ లేవని భావిస్తే శిక్షనే రద్దు చేయచ్చు. ఒకవేళ హైకోర్టు కూడా కింది కోర్టు తీర్పునే ఖరారు చేస్తే నిందితులకు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశముంది. అంతిమంగా సుప్రీంకోర్టు కూడా ఉరిశిక్షను ఖరారు చేస్తే నిందితులకు మిగిలిన ఏకైక అవకాశం రాష్ట్రపతికి క్షమాభిక్ష పిటిషన్ పెట్టుకోవడమే. రాష్ట్రపతి కరుణించి శిక్షను రద్దు చేయడం లేదా, తీవ్రతను తగ్గించే నిర్ణయం తీసుకోవచ్చు. లేదా క్షమాభిక్ష పిటిషన్‌ను తిరస్కరించనూ వచ్చు. అలా తిరస్కరిస్తే నిందితులకు అన్ని దారులూ మూసుకుపోయినట్టే.

ఉరిశిక్ష పడిన నేరస్తులు సెంట్రల్ జైలుకే

రాష్ట్రంలో ఏ కోర్టు ఉరిశిక్ష వేసినా నేరస్తులను నెల్లూరు, కడప, రాజమండ్రి, విశాఖల్లోని ఏదేని ఒక సెంట్రల్ జైలుకు పంపిస్తారు. ఉరిశిక్ష అమలయ్యే దాకా లేదా పైకోర్టులు ఆ శిక్షను రద్దు చేయడం లేదా మార్చడం చేసే దాకా అక్కడే ఉంచుతారు.

ఉరిశిక్ష అమలయ్యేది రాజమండ్రిలోనే

రాష్ట్రంలో ఎవరికి ఉరిశిక్ష పడినా అమలు చేసే సదుపాయం ఉండేది రాజమండ్రి సెంట్రల్ జైలులోనే. అక్కడ ఇద్దరు తలారులు అందుబాటులో ఉంటారు. రాష్ట్రంలో చివరగా ఉరిశిక్ష అమలు చేసింది 1978లో అని తెలుస్తోంది. ఆ తర్వాత ఎవరినీ ఉరి తీయలేదని జైళ్లశాఖ వర్గాలు చెబుతున్నాయి.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

అన్నప్రసాదం ట్రస్టుకు 6 నెలల్లో రూ.180 కోట్ల విరాళాలు

తిరుమల, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): వెంగమాంబ అన్నప్రసాద ట్రస్టుకు భక్తుల నుంచి ఆరు నెలల కాలంలో రూ. 180 కోట్లు విరాళంగా అందాయి. అంటే సగటున రోజుకు కోటి రూపాయలు ఈ ఒక్క ట్రస్టుకే భక్తులు సమర్పిస్తున్నారు. శ్రీనివాసుడి సమక్షంలో అన్నదానం అన్నది గొప్ప పుణ్యకార్యక్రమం కావడంతో విశేషంగా స్పందిస్తున్నారు. ఇప్పటికే ఈ ట్రస్టు వద్ద రూ.2,300 కోట్లు డిపాజిట్లు రూపంలో ఉన్నాయి. ఈ మొత్తం మీద వచ్చే వడ్డీతోనే ప్రస్తుతం అన్నదాన కార్యక్రమం జరుగుతోంది. అన్నప్రసాదకేంద్రంలో ఆయుధ పూజ సందర్భంగా శుక్రవారం ఆయన మీడియాతో ముచ్చటిస్తూ టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఈ వివరాలు తెలిపారు. 1985లో అన్నదాన కార్యక్రమం తిరుమలలో ప్రారంభించగా 1994లో శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుగా మారి సేవలందిస్తోంది.

టీటీడీ ఆలయాలన్నింటిలోనూ అన్నదానం

వెంగమాంబ భవనంతో పాటు వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, బయట ఫుడ్ కౌంటర్ల ద్వారా కూడా అన్నప్రసాదాలు అందిస్తున్నారన్నారు. త్వరలో టీటీడీ అనుబంధ ఆలయాల్లోనూ రోజువారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామన్నారు. ఇందుకోసం శ్రీవాణి ట్రస్టు నిధులను వినియోగిస్తామన్నారు.

అన్నప్రసాద భవనంలో ఆయుధపూజ

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో శుక్రవారం ఆయుధపూజ జరిగింది. అన్నప్రసాదాల తయారీకి వినియోగించే యంత్రాలు, పాత్రలకు పూజలు చేశారు. అనంతరం అన్నదానం సిబ్బందిని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ సత్కరించారు. కిచెన్‌తో పాటు కూరగాయలు నిల్వచేసే ప్రాంతాలను ఈవో పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కాగా కిచెన్ ఆధునీకరణ సమయంలో చేయనున్న తాత్కాలిక ఏర్పాట్ల గురించి అధికారులు ఈవోకు వివరించారు.



విజిబుల్ పోలీసింగ్

● సాయంత్రం 5 నుంచి రాత్రి 11 గంటల వరకు రోడ్లపై ఉండాలి

● కమ్యూనిటీ వ్యవస్థ బలోపేతానికి పటిష్ఠ ప్రణాళిక

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విజిబుల్ పోలీసింగ్‌కు ఎస్పీ సుబ్బరాయుడు ప్రాధాన్యమిస్తున్నారు. నేరాల కట్టడికి ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఈ దిశగా పోలీస్ యంత్రాంగాన్ని పటిష్ఠపరిచే చర్యలు చేపడుతున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి అర్ధరాత్రి 11 గంటల వరకు పోలీసులు రోడ్లపైనే కనిపించాలంటూ డీఎస్పీలకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పోలీసు స్టేషన్ల వారీగా విజిబుల్ పోలీసింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ప్రతి రోజూ సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎస్టీఎఫ్ పార్టీలను వెంట పెట్టుకుని ఎస్ఐలు, ఏఎస్ఐలు,పోలీసులు బృందాలుగా విడిపోయి రోడ్లపైకి వచ్చి పనిచేయాలని ఎస్పీ నిర్ణయించారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకు ఎస్ఐలు వీధుల్లోకి వచ్చి ప్రజలతో కలసి పర్యటించాలని చెప్పారు. నేరాలు, దొంగతనాలు, సైబర్ నేరాలు, గంజాయి, ఎర్రచందనం స్మగ్లింగ్ కట్టడికి గట్టిగా పనిచేసి జిల్లాను నేర రహిత ప్రాంతంగా మార్చాలని అధికారులు ఆలోచిస్తున్నారు. ప్రజా చైతన్యంతోనే నేరాల కట్టడి సాధ్యపడుతుందని భావించిన సీఎం చంద్రబాబు ఆ దిశగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో ఉన్న సాంకేతిక వ్యవస్థలను వాడుకుంటూనే ప్రజల భాగస్వామ్యంతో 'కమ్యూనిటీ ఫస్ట్' పేరిట విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేయాలని ఎస్పీ సుబ్బరాయుడు నిర్ణయించారు. ఆర్థిక, సైబర్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించి.. కట్టడి చేసే దిశగా వ్యూహం రచిస్తున్నారు. మరోవైపు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు నివారించడానికి ప్రత్యేక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు.

ఆగండి.. ముఖం కడుక్కుని వెళ్లండి

మరోవైపు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న తీరు తెన్నులపై యంత్రాంగం అధ్యయనం చేసింది. ప్రధానంగా తెల్లవారు జామున 2 నుంచి 4 గంటల మధ్య రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని పోలీసు శాఖ గుర్తించింది. ఈ క్రమంలో 'కాసేపు ఆగండి.. ముఖం కడుక్కుని వెళ్లండి' అంటూ వాహనాలను ఆపి తనిఖీలు చేసి డ్రైవర్లను నిద్ర మత్తులో నుంచి మేల్కొలిపే దిశగా ఆలోచిస్తున్నారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియ పూర్తయితే పీఎం కిసాన్ నగదు రైతుల ఖాతాలో జమవుతుందని చెప్పారు. కలెక్టరేట్‌లో శుక్రవారం డీఆర్వో నరసింహులుతో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈకేవైసీ పెండింగ్, ఆధార్ నంబర్, బ్యాంకు ఖాతాలకు లింక్ కాకపోవడం, మ్యుటేషన్, రాంగ్ ఆధార్ వంటి సమస్యలతో పెండింగులో ఉన్న 57,096 దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. రెండు, మూడో విడతల్లో నగదు జమ చేసేటప్పటికి అర్హులైన రైతులను గుర్తించి లబ్ధి పొందేలా చూడాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్, సహాయ వ్యవసాయాధికారి ధనంజయరెడ్డి, కోఆపరేటివ్ అధికారిణి నాగవర్ధనమ్మ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

ఎరువుల సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూడండి

రైతులకు ఎరువుల సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏపీ మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు. పవన్, వ్యవసాయ సహాయ సంచాలకుడు ధనంజయరెడ్డి తదితరులతోసమీక్షించారు. యూరియా 7,969 టన్నులు, డీఏపీ 1,086 టన్నులు, ఎంవోపీ 527 టన్నులు, కాంప్లెక్సు 5,877 టన్నులు, ఎస్ఎస్‌పీ 1,328మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు. యూరియా కార్డుల ద్వారా ప్రతి రైతుకూ ఎకరాకు 3 బస్తాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

బాలికపై లైంగిక దాడికి యత్నం

● గూడూరు ఏరియా ఆస్పత్రిలో ఘటన

గూడూరు అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గూడూరు ఏరియా ఆస్పత్రిలో గురువారం రాత్రి బాలికపై వృద్ధుడు లైంగిక దాడికి యత్నించడంతో స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఆస్పత్రి సిబ్బంది తెలిపిన ప్రకారం.. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి తోడుగా కుటుంబీకులు ఉన్నారు. అదే వార్డులో చికిత్స పొందుతున్న మరొకరికి తోడుగా జమీర్‌బాషా అనే వృద్ధుడు ఉన్నాడు. గురువారం రాత్రి మరో రోగి కుటుంబసభ్యులతో కలిసి నిద్రిస్తున్న బాలికపై జమీర్‌బాషా లైంగిక దాడికి యత్నించాడు. బాలిక కేకలు వేయడంతో సిబ్బంది, స్థానికులు అతడిని పట్టుకుని దేహశుద్ధి చేసి ఒకటో పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో శుక్రవారం ఎస్పీ సుబ్బరాయుడు విచారణ చేపట్టారు. 'ఈ ఫిర్యాదుపై దర్యాప్తు చేస్తున్నాం. నిందితుడిపై చట్టప్రకారం కఠిన చర్యలు చేపడతాం' అని ఆయన మీడియాకు చెప్పారు. విచారణలో ఏఎస్పీ మనోహరాచారి, డీఎస్పీలు గీతాకుమారి, చెంచుబాబు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి షిఫ్ట్ ఆపరేటర్ మృతి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కరెంటు తీగలకు మరమ్మతులు చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కాంట్రాక్ట్ షిఫ్ట్ ఆపరేటర్ కిన్నెర సాంబచిన్నయ్య (41) మృతి చెందారు. ఈ ఘటన బుచ్చినాయుడు కండ్రిగ మండలం లక్ష్మీపురం గిరిజన కాలనీ సమీపంలోని మామిడి తోటలో శుక్రవారం జరిగింది. నీర్పాకోట దళితవాడకు చెందిన సాంబచిన్నయ్య వెస్ట్‌వరత్తూరు సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్‌గా (ఒప్పంద ఉద్యోగి) పని చేస్తున్నారు. మొంథా తుపానుతో లక్ష్మీపురం గిరిజన కాలనీ సమీపంలో పి.వెంకటసుబ్బయ్య నాయుడు మామిడి తోటలో మరమ్మతులకు గురైన విద్యుత్ వైర్లను సరి చేయడానికి శుక్రవారం ఉదయం 8గంటలకు వెళ్లారాయన. విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు 11కేవీ వైర్లు తలపై తగలడంతో మృతి చెందారు. ఉదయం 9గంటల నుంచి ఆయన ఫోన్‌లో అందుబాటులోకి రాకపోవడంతో సహ ఉద్యోగి సంఘటనా స్థలానికి వెళ్లారు. అక్కడ సాంబ చిన్నయ్య మృతి చెంది ఉన్నారు. ఆయన కుటుంబీకులకు, డిస్కం ఏఈ చలపతికి ఆయన సమాచారమిచ్చారు. ఎస్ఐ హరిప్రసాద్‌కు ఏఈ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా సాంబచిన్నయ్యకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గతంలో ఒకసారి విద్యుదాఘాతానికి గురై కోలుకున్నారు.

గరుడ వారధిపై బ్లికింగ్ సిగ్నల్ లైట్స్

తిరుపతి (నేరవిభాగం), అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలోని గరుడ వారధిపై ప్రమాదాల నివారణకు ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో పోలీసులు చర్యలు చేపట్టారు. కలెక్టర్ వెంకటేశ్వర్, కమిషనర్ మౌర్య, నగర ప్లానింగ్ అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకున్నారు. వారధిపై, మలుపుల వద్ద బ్లికింగ్ సిగ్నల్ లైట్స్, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ కంట్రోల్ సైన్ బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో స్పష్టంగా కనిపించేలా సూచికలను అమర్చారు. వాహనదారులు నియంత్రిత వేగంతో, జాగ్రత్తగా ప్రయాణించేలా పోలీసులు చర్యలు చేపట్టారు.

చిత్తూరులో 144వ సెక్షన్ అమలు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దివంగత మేయర్ కఠారి అనురాధ, మోహన్ దంపతుల కేసుకు సంబంధించిన తీర్పు శుక్రవారం వెలువడిన నేపథ్యంలో చిత్తూరులో శాంతి భద్రతల పరిరక్షణకు 144 సెక్షన్ విధించినట్లు డీఎస్పీ సాయినాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. శాంతిభద్రతలను కాపాడటంతో పోలీసుశాఖకు ప్రజలు సహకరించాలన్నారు.సోషల్ మీడియా, ప్రజా వేదికల ద్వారా వివాదాస్పద వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొన్నారు.ఎవరైనా ఉల్లఘింస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కఠారి కుటుంబానికి అండగా చంద్రబాబు

పార్టీలో, ప్రభుత్వంలో సముచిత స్థానం

చిత్తూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన కఠారి కుటుంబానికి సీఎం చంద్రబాబు అండగా నిలిచారు.టీడీపీలో, ప్రభుత్వంలో వారి కుటుంబీలకులకు పెద్ద పీట వేశారు. హత్య జరిగిన సమయంలో సీఎంగా ఉన్న ఆయన కేసు పటిష్ఠంగా ఉండేలా చూసుకున్నారు. అనురాధ తర్వాత కొన్నాళ్ల పాటు డిప్యూటీ మేయర్ సుబ్రి ఇన్‌చార్జి మేయర్‌గా వ్యవహరించారు. గంగనపల్లె డివిజన్‌లో జరిగిన ఉప ఎన్నికలో అనురాధ కోడలు హేమలత కార్పొరేటర్‌గా గెలిచి, మేయర్‌గా బాధ్యతలు తీసుకున్నారు. కరోనా సమయంలో హేమలత భర్త ప్రవీణ్ మరణించగా, కొన్నాళ్ల తర్వాత ప్రతిపక్ష నాయకుడి హోదాలో చంద్రబాబు ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అక్రమ కేసులతో హేమలతను వైసీపీ వేధించింది. ఓ పోలీసు జీపును ఆమె కాళ్లపై ఎక్కించగా గాయపడ్డారు. అప్పుడు చంద్రబాబు ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. వైసీపీ హయాంలో 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ఎన్ని బెదిరింపులు చేసినా గంగనపల్లెలో హేమలత గెలిచారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటును ఆశించిన హేమలతకు పార్టీ అధికారంలోకి వచ్చాక మంచి స్థానం దక్కింది. తొలుత పర్యాటక కార్పొరేషన్ డైరెక్టర్ పదవిచ్చినా, ఆ తర్వాత సీఎం చంద్రబాబు చుడా ఛైర్‌పర్సన్ పదవి ఇచ్చారు.

చింటూ రక్త చరిత్ర



చిత్తూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి):కఠారి అనురాధ దంపతుల హత్య కేసులో ఉరి శిక్ష పడిన ఐదుగురు నిందితుల్లో ముగ్గురికి ఇదే తొలి నేరం కాగా.. ఇద్దరికి అప్పటికే నేర చరిత్ర ఉంది. ప్రధాన నిందితుడు చింటూ తన మేనమామ కఠారి మోహన్ కోసం అప్పటి ఎమ్మెల్యే సీకే బాబు మీద రెండుసార్లు హత్యాయత్నం చేయగా.. ఏ2 వెంకటాచలపతి ఓ కేసులో నిందితుడిగా ఉన్నాడు. చింటూ వద్ద పనులు చేసుకునే మిగిలిన ముగ్గురికీ గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదు. ఐదుగురు నేరస్థుల్లో నలుగురికి పెళ్లి కాలేదు.

రెండుసార్లు సీకేపై హత్యాయత్నం

● శ్రీరామ చంద్రశేఖర్ అలియాస్ చింటూ (55) కఠారి మోహన్‌కు మేనల్లుడు. ముంబాయిలో మెరైన్ ఇంజనీర్‌గా పని చేసేవాడు. అప్పటి ఎమ్మెల్యే సీకే బాబుతో మేనమామకు నిత్యం గొడవలు జరుగుతుండడంతో.. ఆయనకు అండగా వుండడంకోసం ఉద్యోగాన్ని వదిలేసి 2006లో చిత్తూరు వచ్చేశాడు. 2007లో సీకే బాబుపై ఎమ్మెస్సార్ సర్కిల్ సమీపంలోని క్లబ్ వద్ద హత్యాయత్నం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి కఠారి మోహన్, చింటూల మీద కేసు నమోదైంది. తర్వాత కాలంలో కోర్టు ఈ కేసును కొట్టేసింది. అదే ఏడాది డిసెంబరు 31న కట్టమంచి సాయిబాబా గుడి ఎదురుగా కూడా సీకే బాబు మీద మరోసారి హత్యాయత్నం జరిగింది. బాంబు దాడిలో సీకే తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చేరగా, గన్‌మ్యాన్ మరణించారు. ఇక్కడా మోహన్, చింటూలపై కేసు నమోదు చేయగా, చింటూకు మాత్రం కోర్టు జీవితఖైదు విధించింది. తర్వాత హైకోర్టు ఈ కేసును కొట్టివేసింది.

● ఏ2 వెంకటాచలపతి (61) కర్ణాటక రాష్ట్రం ముళ్‌బాగళ్‌కు చెందినవాడు. కఠారి మోహన్‌కు అక్కడ బంధువులుండడంతో వెళ్తూ వుండేవారు. ఆయనతో పాటు చింటూ కూడా వెళ్లేవారు. అక్కడ చింటూతో వెంకటాచలపతికి పరిచయమైంది. 2007లో క్లబ్ వద్ద సీకే బాబు మీద జరిగిన హత్యాయత్నం కేసులో ఇతను కూడా నిందితుడిగా ఉన్నాడు. ఇతనికి భార్య, కుమార్తె ఉండగా, 2007కు ముందు ఆ రాష్ట్ర ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసేవాడు.

● ఏ3 జయ ప్రకాష్‌రెడ్డి (33) చిత్తూరు నగరం గంగనపల్లె ప్రాంతానికి చెందినవాడు. చింటూ వద్ద ఆఫీసు బాయ్‌గా పనిచేసేవాడు. ఇతడి తండ్రి ఆటో డ్రైవర్.

● ఏ4 మంజునాథ్ (37) గంగవరం మండలం మారేడుపల్లెకు చెందినవాడు. చింటూ వద్ద వంట మనిషిగా పనిచేసేవాడు. కుక్కల్ని కూడా చూసుకునేవాడు.

● ఏ5 వెంకటేష్ (49) చిత్తూరు నగరం గంగనపల్లెకు చెందినవాడు. చింటూ కారు డ్రైవర్‌గా పనిచేసేవాడు.

● ఉరి శిక్ష పడ్డ వారిలో నలుగురికి పెళ్లి కాలేదు. ముళబాగళ్‌కు చెందిన వెంకటాచలపతికి మాత్రమే పెళ్లయి ఓ కుమార్తె ఉంది.ఏ3 జయప్రకాష్‌రెడ్డి 23 ఏళ్ల వయసు నుంచి, ఏ4 మంజునాథ్ 27 ఏళ్ల వయసు నుంచీ జైల్లోనే ఉంటున్నారు.

● పొట్ట కూటి కోసం వచ్చిన ఆ ముగ్గురు

ఏ3, ఏ4, ఏ5 జయప్రకాష్‌రెడ్డి, మంజునాథ్, వెంకటేష్ ప్రధాన నిందితుడు చింటూ వద్ద పొట్ట కూటి కోసం పనిలో చేరారు. అతని వద్ద రకరకాల పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. ఈ ముగ్గురికీ గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదు. యజమాని వద్ద మెహర్బానీ కోసం హత్య కేసులో భాగస్వాములై జీవితాలను నాశనం చేసుకున్నారు.

రైతు సంక్షేమమే సీఎం చంద్రబాబు ధ్యేయం



రైతులకు యూరియా అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పెళ్లకూరు, అక్టోబరు, 31(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే సీఎం చంద్రబాబు నాయుడు ధ్యేయమని టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం చిల్లకూరు సొసైటీ గోడౌన్‌లోని యూరియా పంపిణీ కేంద్రంలో ఏవో విజయభారతి, చిల్లకూరు పీఏసీఎస్ చైర్మన్ కొచ్చర్ల వెంకటరమణయ్య నాయుడుతో కలిసి రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరానికి మూడు బస్తాల యూరియా అందజేస్తున్నట్లు తెలిపారు. పారదర్శకంగా టోకెన్ విధానంలో యూరియా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. అన్నదాతలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రతి రైతుకూ సరిపడా యూరియా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వీఏఏ అశోక్, సొసైటీ సిబ్బంది నెలవల లోకేష్, టీడీపీ నాయకులు భైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, రాధానాయుడు, హరినాయుడు, కృపాకర్ రెడ్డి తదితరలు పాల్గొన్నారు.

పేరం రమేష్‌ను పరామర్శించిన నెలవల



రమేష్‌నాయుడిని పరామర్శిస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం

పెళ్లకూరు, అక్టోబరు, 31(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు గ్రామానికి చెందిన స్వర్ణముఖినది ఆనకట్ట ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్ నాయుడును సూళ్లూరుపేట నియోకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం శుక్రవారం పరామర్శించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన రమేష్ నాయుడును చికిత్స అనంతరం ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటున్నారు. నెలవల సుబ్రహ్మణ్యం పెళ్లకూరులోని రమేష్ నాయుడు నివాసానికి వెళ్లి ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. నెలవల వెంట టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు శిరసనం బేటి చైతన్యకృష్ణారెడ్డి, చిల్లకూరు పీఏసీఎస్ డైరెక్టర్ పెళ్లకూరు గోపాల్‌కృష్ణ, చంద్ర, హరిబాబు తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శంకర్ శర్మ

సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మహిళ సాధికార, మండల న్యాయ సేవా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. పిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్‌శర్మ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆర్థిక స్వావలంబన సాధించాలన్నారు. గ్రామాల్లో బాల్య వివాహాలపై విద్యార్థులు అవగాహన కల్పించి నిర్మూలించాల్సిన అవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ధర్మాప్రసాద్, మహిళా సాధికార విభాగ అధ్యక్షురాలు ఉషారాణి, వైస్ పిన్సిపాల్ విక్టోరియా రాణి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థినుల ఎంపిక



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్‌ఎం, పీడీ

గూడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికైనట్లు హెచ్‌ఎం మములాజాన్ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పల్లవి, అనిత ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థినులను కార్యక్రమంలో హెచ్‌ఎం, పీడీ విజయలక్ష్మి అభినందించారు.

వాలీబాల్ పోటీలకు కోటపోలూరు విద్యార్థి



క్రాంతికుమార్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీఈటీ, ఉపాధ్యాయులు

సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో జరిగిన జిల్లా స్థాయి అండర్ 17 వాలీబాల్ పోటీల్లో కోటపోలూరు హైస్కూల్‌కు చెందిన కిలివేటి క్రాంతికుమార్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. నవంబరు 1 నుంచి 3వ తేదీ వరకు తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరిగే రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడాపోటీల్లో క్రాంతికుమార్ పాల్గొననున్నారు. క్రాంతికుమార్, పీఈటీ భాస్కర్‌ను ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి, ఉపాధ్యాయులు అభినందించారు.

చిట్టమూరు, గునపాడు విద్యార్థులు...



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన వాసు, శ్రావ్య

చిట్టమూరు, అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): చిట్టమూరు ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దారా వాసు, గునపాడు ఉన్నత పాఠశాలలో 9 తరగతి చదువుతున్న యన్నం శ్రావ్య రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యారు. వారిని ఎంఈవో బీవీ కృష్ణయ్య, చిట్టమూరు, గునపాడు హెచ్‌ఎంలు నాగేశ్వరరావు, భూపయ్య, పీడీ భరత్ మహిపతి అభినందించారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

వెంకటగిరి టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్స్ యజమానులు యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏడీఏ అనసూయ అన్నారు. శుక్రవారం పలు ఎరువుల దుకాణలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగు మందులు, విత్తనాలు విషయాల్లో రైతులను ఇబ్బందులు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాల్లో స్టాక్ బోర్డులను ఏర్పాటు చేయాలని, ప్రభుత్వం నిబంధనల ప్రకారం ఎరువుల అమ్మకాలు జరగాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వెంకటగిరి ఏవో సుజాత, డక్కిలి ఏవో శిరీషా, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

బైక్‌ను ఢీకొన్న లారీ: ఇద్దరికి గాయాలు

తడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బైక్‌ను లారీ ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. తడకు చెందిన వెంకటేశ్వర్లు(42) శ్రీసిటీ సెజ్‌లోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. శుక్రవారం సొంత పనిమీద కుమార్తె సంధ్యతో కలసి బైక్‌లో సూళ్లూరుపేటకు వెళ్లాడు. తిరిగి వెళ్తుండగా చేనిగుంట జాతీయ రహదారి మలుపు వద్ద లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తండ్రి, కుమార్తెకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నై తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు బైక్‌ల ఢీ

కోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణ పరిధిలోని గోపాల్‌రెడ్డి విగ్రహం వద్ద శుక్రవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కోటకు చెందిన రఘువరణ్, ఈశ్వరయ్య మోటారు బైక్‌లలో వెళ్తూ ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పారదర్శకంగా యూరియా పంపిణీ

డక్కిలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా పంపిణీలో ఎరువుల దుకాణ దారులు పారదర్శకత పాటించాలని వెంకటగిరి వ్యవసాయ సంచాలకులు అనుసూయ అన్నారు. శుక్రవారం ఆమె డక్కిలిలోని ఎరువుల దుకాణాలను సందర్శించి యూరియా పంపిణీలో డీలర్లకు సూచనలు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ కార్డుపొందిన రైతులకు మాత్రమే యూరియా బస్తాలు అందజేయాలని దుకాణదారులకు సూచించారు. డీలర్లు రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, స్టాక్ రికార్డు పారదర్శకంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారి శిరీషా తదితరులు పాల్గొన్నారు.

కోటమ్మకు పంచలోహ విగ్రహ వితరణ



వెంకన్నపాళెంలో ఊరేగుతున్న కోటమ్మ విగ్రహం

కోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రామదేవత కోటమ్మకు వెంకన్నపాళెం గ్రామానికి చెందిన మనపాక వెంకటేష్, వెంకటశేషమ్మ పంచలోహ విగ్రహాన్ని శుక్రవారం అందజేశారు. అలాగే ఊంజల్ సేవకు అవసరమైన సామగ్రిని వితరణగా ఇచ్చారు. ఆ విగ్రహంతో మేళతాళాలు, బాణసంచా పేలుళ్ల నడుమ వెంకన్నపాళెం నుంచి కోటమ్మ గుడి వరకు గ్రామోత్సవం జరిగింది.

తుఫాను బాధితులకు సరుకుల పంపిణీ



తుఫాను బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న అధికారులు

డక్కిలి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగోడు గ్రామంలో తుఫాను కారణంగా నష్టపోయి పునరావాస కేంద్రాల్లో తలదాచుకొన్న 65 కుటుంబాలకు శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్నరాణి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధితులకు 25 కిలోలు బియ్యం, చక్కెర, కందిపప్పు, నూనే, ఆలూగడ్డలు, ఎర్రగడ్డలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోను రాజశేఖర్, లింగసముద్రం సింగిల్ విండో అధ్యక్షుడు రంగినేని రాజా పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

చిల్లకూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా ఇబ్బందులకు గురైన తమ్మినపట్నం గిరిజనకాలనీ వాసులకు శుక్రవారం తహసీల్దారు శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో రామయ్య, వెంకయ్య, సుబ్రహ్మణ్యం, వీఆర్‌వో బాలాజీ, కరపయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార కుటుంబాలకు కూరగాయలు

తడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా వేటను నిలిపివేసిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం సరఫరా చేసిన కూరగాయలు శుక్రవారం తడకు చేరుకున్నాయి. వాటిని ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్ చేతుల మీదుగా మత్స్యకార నేత బొమ్మన పళణికి భీములవారిపాళెంలో అందజేశారు. అనంతరం ఒక్కో మత్స్యకార కుటుంబానికి కేజీ చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏకాంబరం, సుధాకర్, జయపాల్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పెళ్లకూరు, అక్టోబరు, 31 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ హరికృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని చెంబడిపాలెం గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఎంపీడీవో ప్రమీలారాణి మాట్లాడుతూ పౌరులందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిదని, ఒకరు ఇంకొకరిపై వివక్ష చూపితే చట్టరీత్యా నేరం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మనోజ్‌కుమార్, హౌసింగ్ ఏఈ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి

గూడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక టవర్‌క్లాక్ కేంద్రం వద్ద ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తోందన్నారు. అనంతరం ఏఐటీయూసీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో శశికుమార్, జమాలుల్లా, రాఘవయ్య, మీరసాహెబ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి ఇందిరాగాంధీ కృషి

గూడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పేదప్రజల అభ్యున్నతి కోసం మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ ఎనలేని కృషిచేశారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఇందిరాగాంధీ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూల చంద్రశేఖర్, వేమయ్య, సుబ్బారావు, బ్రహ్మయ్య, సుబ్బరామరాజు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మంగళంపాడులో సెన్సార్ వీధి దీపాలు

సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మంగళంపాడు పంచాయతీలో సర్పంచ్ రుక్మిణి, టీడీపీ నాయకుడు ఏలిమేటి సతీష్ ఆధ్వర్యంలో సెన్సార్ వీధి దీపాలు ఏర్పాటు వేశారు. మంగళంపాడు గ్రామంతో ఆత్రేయ కాలనీ, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో 94 వీధి దీపాలు ఏర్పాటు వేశారు. ఇవన్నీ సాయంత్రం 6గంటలకు వెలిగి తిరిగి ఉదయం 6గంటలకు ఆరిపోయే విధంగా సెన్సార్ అమర్చారు.





గూడూరులో 2కే రన్‌లో డీఎస్పీ గీతాకుమారి, పోలీసులు - నాయుడుపేటలో 2కే రన్‌ను జెండాఊపి ప్రారంభిస్తున్న డీఎస్పీ చెంచుబాబు

దేశ సమైక్యతకు యువత పాటుపడాలి

గూడూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యతకు యువత పాటుపడాలని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోటుపాళెం జాతీయ రహదారి కూడలి నుంచి పట్టణంలోని టవర్‌క్లాక్ కేంద్రం వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీస్‌శాఖ అంకితభావంతో కృషి చేస్తోందన్నారు. దేశ సమగ్రత కోసం ప్రాణాలను సైతం అర్పిస్తూ ఎందరికో పోలీసులు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారన్నారు. దేశ ఐక్యత కోసం ఆయన ఎనలేని కృషిచేసిన తొలి ఉపప్రధాని, స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను యువత ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, కిషోర్‌బాబు, హుస్సేన్‌బాషా, ఎస్ఐలు తిరుపతయ్య, సుబ్రహ్మణ్యం రాజు, షాజహాన్, పవన్‌కుమార్, సురేష్‌బాబు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులు, కోటేశ్వరరావు, డాక్టర్ వీర్‌కుమార్, డాక్టర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: తొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. పటేల్ జయంతి, పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల ముగింపును పురస్కరించుకునిలో శుక్రవారం పాత బస్టాండ్ నుంచి సీఎస్ తేజా సెంటర్ వరకు డీఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో 2కే రన్ నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు డీఎస్పీ చెంచుబాబు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐలు బాబి, సంగమేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా, ఎంఈవో మునిరత్నం, ఎస్ఐలు నాగరాజు, ఆదిలక్ష్మి, భానుప్రసన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తడ: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా శుక్రవారం జాతీయ సమైక్యతా దినోత్సవం నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు శరత్‌బాబు, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో శేఖర్‌నాయక్, విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు వేములు, మల్లికార్జునరావు పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు.

వెంకటగిరి టౌన్: పోలీసు అమవీరుల దినోత్సవం, సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా 2కే రన్ నిర్వహించారు. 9వ బెటాలియన్ కమాండెంట్ ఈఎస్ఎస్ ప్రసాద్, వెంకటగిరి సీఐ రమణ ఆధ్వర్యంలో క్రాస్ రోడ్డు నుంచి పాలకేంద్రం వరకు 2కే రన్ నిర్వహించారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం అనీల

కోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని, ఈ దిశగా పొదుపు సంఘాల మహిళలకు అవగాహన కల్పించాలని వెలుగు ఏపీఎం అనీల కోరారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బ్యాంకుల రుణాల రికవరీ, పింఛన్ పథకాల ప్రచారంపై సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీల్లో పొదుపు సంఘాలు వాణిజ్య బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. అదే విధంగా మలివిడత రుణాలు పొందేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో సంఘమిత్ర అధ్యక్షురాలు ముత్యాలమ్మ, సీసీలు ప్రసాద్, శ్రీకాంత్, భాస్కర్, శంకర్, అలివేలమ్మ, బిందు, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్‌కు సన్మానం



దివ్యజ్యోతిని సన్మానిస్తున్న ఎంపీడీవో నారాయణ, సిబ్బంది

బాలాయపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దివ్యజ్యోతి స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. శుక్రవారం ఆమెను ఎంపీడీవో నారాయణ, సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ

పెళ్లకూరు, అక్టోబరు, 31 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మండలంలోని జీలపాటూరు, పెళ్లకూరు గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేరకణ చేపట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మద్దాల సోమశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఓబ్బు వెంకటరత్నం, నాయకులు ఇలుపూరు పాండురంగయ్య మొదలియార్, కేసు ప్రసాద్‌యాదవ్, పట్టూరు మోహన్‌రెడ్డి, ఎల్లు మోహన్, జితేంద్ర, బాలు తదితరులు పాల్గొన్నారు.

తిరుపతిలో ఫ్యాషన్ జూనియర్స్ శిక్షణ

తిరుపతి అర్బన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): నగరంలో తొలిసారిగా ఫ్యాషన్ జూనియర్స్ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకురాలు రాధిక తెలిపారు. ఖాదీ కాలనీలోని వన్ అండ్ ఓన్లీ ఫ్యాషన్ జూనియర్స్ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. పెద్ద నగరాల్లో మాత్రమే ఉన్న ఫ్యాషన్స్ జూనియర్స్ శిక్షణను తిరుపతిలో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. బాల్యంలోనే టాలెంట్‌ను వెలికితీయడానికి, తెరంగేట్రం చేయడానికి ఇదొక చక్కటి అవకాశమన్నారు. 4 నుంచి 19 సంవత్సరాల బాలబాలికలు పాల్గొనవచ్చునని, శనివారం నుంచి రిజిస్ట్రేషన్స్ జరుగుతాయని తెలిపారు. వివరాల కోసం 9959777295ను సంప్రదించాలని కోరారు.

పూరిల్లు దగ్ధం

పెళ్లకూరు, అక్టోబరు, 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలచ్చూరులో ఓ పూరిల్లు శుక్రవారం దగ్ధమైంది. గ్రామా నికి చెందిన ఎద్దల కృష్ణారెడ్డి పూరింట్లో షార్ట్‌సర్క్యూట్ జరగ డంతో మంటలు చేలరేగాయి. గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందిం చారు. వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇల్లు కాలిపోయింది. వీఆర్వో మోబీనా వివరాలు తెలుసుకున్నారు.

నిమ్మచెట్ల సంరక్షణపై అవగాహన

వెంకటగిరి టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొక్కలపాడు, పాలకొండ సత్రం గ్రామాల్లో రైతులకు నిమ్మచెట్ల సంరక్షణపై ఉదానవన శాఖ అధికారి ఆనంద్‌రెడ్డి, కేవీకే అధిపతి శ్రీధర్ శుక్రవారం అవగాహన కల్పించారు. తుఫాన్ వల్ల నేలకు వరిగిన చెట్లకు ఊతం ఇచ్చి నిలబెట్టాలన్నారు. అలాగే పాదుల్లో ఉండే అధిక నీరు తొలగించి బ్లైటాక్స్ పిచికారీ చేయాలని, చెట్లకు మొదలు భాగంలో యూరియా, పొటాష్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు విజయశ్రీ, తిరుపాల్, నాగార్జునరెడ్డి, రాజీవన పాల్గొన్నారు.

దాడి చేశారని ఫిర్యాదు

సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మత కాముడి - దామానెల్లూరు క్రాస్ రోడ్డు వద్ద తండా రమణయ్య మరో నలు గురు వ్యక్తులు తనను అడ్డగించి మరణాయుధా లతో దాడి చేశారని సూళ్లూరుపేట ఎంఈవో కార్యాల యంలో ఎంఆర్పీగా పని చేస్తున్న వేలూరు అంకయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో భాగంగా ఈనెల 29న సుగ్గుపల్లి పాఠశాలకు వెళ్లి వస్తుండగా దామానెల్లూరు - మతకాముడి క్రాస్ రోడ్డు వద్ద నలు గురు వ్యక్తులు దాడిచేసి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి

కురుగొండ్ల

వెంకటగిరి, అక్టోబర్ 31(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిని రెవెన్యూ డివిజన్‌గా చేయాలన్న ప్రజల దీర్ఘకాలిక ఆంకాంక్షను నెరవేర్చే దిశగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కురగొండ్ల రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలు, రెవెన్యూ డివిజన్ల పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్న నేపథ్యంలో వెంకటగిరి రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలన్న విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లినట్లు పేర్కొన్నారు. వెంకటగిరి రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడితే పాలనా సౌలభ్యంతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో రక్తదాన శిబిరం

సూళ్లూరుపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల పురష్కరించుకుని శుక్రవారం సూళ్లూరుపేట పోలీస్ స్టేషన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు రక్తదాన శిబిరాన్ని ప్రారంభించగా, ముందుగా సీఐ మురళీకృష్ణ, అనంతరం పట్టణంలోని పలువురు యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాస్పత్రి వైద్యుడు రమేష్, సూళ్లూరుపేట, తడ, ఎస్ఐలు బ్రహ్మనాయుడు, కొండపనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి ఉపాధి కూలీలకు డిజిటల్ హాజరు

తడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు శనివారం నుంచి డిజిటల్ హాజరు నమోదు చేయనున్నట్లు ఎంపీడీవో శేఖర్‌నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొత్త విధానంలో రోజుకు రెండుసార్లు కూలీ హాజరును నమోదు చేస్తారని చెప్పారు.

యూరియా కార్డులను తీసుకోండి

బాలాయపల్లి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యూరియా కావాల్సిన రైతులు ఆయా గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ అసిస్టెంట్‌లను సంప్రదించి కార్డులు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారిణి విజయలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ యూరియా వాడకాన్ని తగ్గించేందుకు, పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.

ఘనంగా జాతీయ సమైక్యతా దినం







శ్రీకాళహస్తి: ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు - పోలీసులు, ప్రముఖుల ర్యాలీ - నాగలాపురం: పరుగు పందెంలో విజేతలకు బహుమతి ప్రదానం

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సమైక్యత దిన వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ సర్దార్‌వల్లబాయ్‌పటేల్ గొప్పతనం గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. అధ్యాపకులు పద్మప్రియ, రుద్రమదేవి, పీడీ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

● పట్టణంలోని ది స్కూల్ వద్ద రన్ ఫర్ యూనిటీ ర్యాలీని డీఎస్పీ నరసింహమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత డ్రగ్స్ వలలో పడవద్దని, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దిస్కూల్ నుంచి జయరామారావువీధి, నాలుగు మాడవీధులు, ఆర్టీసీ కూడలి వరకు ర్యాలీ సాగింది. సీఐలు ప్రకాష్, నాగార్జున రెడ్డి, తిమ్మయ్య, ఎస్ఐలు, న్యాయవాదులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● తొట్టంబేడు మండలం దిగువసాంబయ్య పాళెం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పటేల్ జయంతి వేడుకలను హెచ్‌ఎం కె.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్త మోహనరాణి, ఆయా మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని రన్ ఫర్ యూనిటీలో భాగంగా శుక్రవారం ఉదయం 7.30 గంటలకు సత్యవేడు సీఐ మురళీనాయుడు ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ నుంచి సాయిబాబా ఆలయం వరకు 2 కి.మీ పరుగు పందాన్ని నిర్వహించారు. నాగలాపురం వెస్ట దళితవాడకు చెందిన జయశక్తి, కానిస్టేబల్ మల్లసాయికృష్ణ, సాముయేల్ మొదటి మూడు స్థానాల్లో నిలవగా సీఐ బహుతులు ప్రదానం చేశారు. సర్పంచ్ చిన్నదొరై సుద, ఎంపీపీ సింధు శ్యామ్, ఎంపీడీవో బాలాజీ నాయక్, నాగలాపురం ఎస్ఐ సునీల్, వరదయ్యపాళెం ఎస్ఐ మల్లికార్జున్, శిక్షణ ఎస్ఐ ప్రసాద్, స్టేషన్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట (ఆంధ్రజ్యోతి): వల్లభాయ్ జయంచి సందర్భంగా పట్టణంలోని విద్యార్థులు ఓవర్ బ్రిడ్జి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాసరావు, ఎంపీడీవో రవిచంద్ర, సీఐ జయచంద్ర, ఎస్ఐ సుధాకర్, ఈవోపీఆర్డీ ప్రభురావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినం


జెండా ఆవిష్కరిస్తున్న గురవయ్య తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, నంది సర్కిల్ ఆటో స్టాండ్, టూటౌన్ హైవే ఆటోస్టాండ్, సివిల్ సప్లైస్ గోదాము తదితర ప్రాంతాల్లో యూనియన్ ఏరియా కార్యదర్శి మల్లికార్జున్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణలు జరిగాయి. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి గురవయ్య మాట్లాడుతూ... 1920 అక్టోబరు 31న ముంబై మహానగరంలో సంఘం ప్రారంభమైందన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఉపయోగపడే రీతిలో 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్‌కోడ్లను తీసుకువడం సరికాదన్నారు. లక్ష్మణరెడ్డి, కత్తి రవి, రొడ్డ గోపి, మించల శివకుమార్, శివ, మురళి పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయ పాలకమండలి చైర్మన్‌కు సన్మానం



శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తలమండలి చైర్మన్ బాధ్యతలు చేపట్టడం పూర్వజన్మ సుకృతమ్మని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి అన్నారు. శుక్రవారం ధర్మకర్తల మండలి చైర్మన్ సాయి ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. భక్తుల సేవే పరమావధిగా పని చేయాలని సాయి ప్రసాద్‌ను కోరారు. వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి, టీడీపీబీసీ విభాగ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు, నాయకులు బి.భాస్కర్, వజ్రం కిషోర్, కె.హరిబాబు, కోట చంద్రశేఖర్, అనిల్, ఎస్.మురళీకృష్ణ, రమేష్, హరి, కృష్ణమూర్తి, మురళీనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

అభివృద్ధి పనులకు ఆటంకం

- పనులను ఆమోదించని కౌన్సిల్



సమావేశంలో అజెండాను చదివి వినిపిస్తున్న అధికారులు

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 31(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో అభివృద్ధి పనులకు వైసీపీ పాలకమండలి అడుగడుగునా ఆటంకం కలిగిస్తోంది. శుక్రవారం జరిగిన అత్యవసర కౌన్సిల్ సమావేశంలో అభివృద్ధి పనుల టెండర్ల ఆమోదం, అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నిర్వహించిన టెండర్ల ఆమోదానికి నిరాకరించిన కౌన్సిల్, జనరల్ ఫండ్ నిధులతో చేపట్టాల్సిన పనులకు సంబంధించి రూ.65 లక్షల అంచనాను ఆమోదించింది. పట్టణంలో పలు అభివృద్ధి పనుల నిమిత్తం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ చొరవతో రాష్ట్ర ప్రభుత్వం టీపీఎస్ నిధులు రూ.2 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పలు అభివృద్ధి పనులకు టెండర్లు పిలిచిన మున్సిపల్ అధికారులు కౌన్సిల్ ఆమోదం లేకపోవడంతో ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది. గతంలో తమ వార్డుల్లో అభివృద్ధి పనులకు టెండర్లు నిర్వహిస్తే చేపట్టలేదని వైసీపీ సభ్యులు సాకుగా చూపుతున్నారు. కాగా, ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి జనరల్ ఫండ్ నిధులు అభివృద్ధి పనులకు కేటాయించరాదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన క్రమంలో అప్పటి పనులు చేపట్టలేకపోయామని ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తిస్థాయి వివరాలు కౌన్సిల్ వద్ద ఉన్నప్పటికీ కొంటిసాకులతో పట్టణ అభివృద్ధికి అడ్డుతగులుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటికీ, పుత్తూరు మున్సిపాలిటీలో వైకాపా కౌన్సిల్ పనితీరుతో అభివృద్ధికి నోచుకోవడం లేదని ప్రజలు బహిరంగా చర్చించుకుంటున్నారు. మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్ జయప్రకాష్, మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఐక్యతా స్ఫూర్తికి నిదర్శనం సర్దార్ వల్లభాయ్ పటేల్



ర్యాలీకి బయలుదేరిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు

పుత్తూరు అర్బన్, అక్టోబర్ 31(ఆంధ్రజ్యోతి): భాష, మతం, ప్రాంతం తేడాలు లేకుండా భారతీయులందరినీ ఒకే తాటిపైకి తెచ్చే దిశగా సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రజల్లో ఐక్యతా స్ఫూర్తిని పెంపొందించారని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి అన్నారు. స్వాతంత్రం తర్వాత 562 స్వదేశీ సంస్థానాలను దేశంలో విలీనం చేశాసిన ఘనత పటేల్‌కే దక్కుతుందన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్, సీఐ శేఖర్ రెడ్డి, ఎస్ఐ ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

పుత్తూరు టౌన్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ 106వ వ్య వస్థాపక దినోత్సవాన్ని పుత్తూరులో శుక్రవారం ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. యూనియన్ మండల అధ్యక్షుడు గోపి ఆధ్వ ర్యంలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి, స్వీట్లు పంచిపెట్టారు. కార్మిక వర్గం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. రాజాచారి, రవి, రమేష్, రమణ, సంగయ్య, కైలాసం, గుర్రప్ప, అంకయ్య, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు టీడీపీ నాయకుల హాజరు



పుత్తూరు అర్బన్, అక్టోబర్ 31(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాటం చేసిన టీడీపీ నేతలపై గత వైసీపీ ప్రభు త్వం పెట్టిన కేసులో నాయకులు శుక్రవారం పుత్తూరు కోర్టుకు హాజరయ్యారు. మొత్తం 13 మందిపై కేసు నమోదు కాగా, కోర్టుకు హాజరైన వారిలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, మణి, బాబు రావు, అన్ను, కరుణాకరణ్, పార్తిబన్, రమేష్, బాలాజీ ఉన్నారు. టిడ్కో ఇళ్లను పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేసిన క్రమంలో 2020లో నమోదైన కేసులో దాదాపు 20 మార్లు కోర్టుకు హాజరయ్యామని జీవరత్నం నాయుడు తెలిపారు.

పౌర హక్కుల పరిరక్షణకు కృషి

వడమాలపేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల పరిరక్షణకు కృషి చేస్తామని తహసీల్దార్ జరీనా పేర్కొన్నారు. శుక్రవారం పౌర హక్కుల దినం సందర్భంగా శ్రీబొమ్మరాజపురం పంచాయతీ ఆది ఆంధ్ర వాడలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువు, శ్మశాన వాటిక, మురుగు నీటి కాలువలు, పింఛన్లు, ఇంటి స్థలాల సమస్యలపై గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఆర్ఐ జానీబాషా, శిక్షణ ఎస్ఐ లావణ్య, సర్పంచ్ మణిరాజు, వీఆర్వో సతీష్, కార్యదర్శి రితేష్ పాల్గొన్నారు.

ఇందిరమ్మకు ఘన నివాళి



పుత్తూరు టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతిని పుత్తూరులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ కౌన్సిలర్ కార్తీకేయన్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఇందిరా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్, ఉపాధ్యక్షుడు దేశయ్య, కేశవులు, పురుషోత్తంరెడ్డి, భాగ్యరాజ్, శేఖర్, సుధాకర్, పళణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

ఇందిరాగాంధీకి ఘన నివాళులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలో దివంగత మాజీ పీఎం ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దామోదర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత బత్తెయ్యనాయుడు వేర్వేరుగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. తొలి మహిళా ప్రధానిగా దేశ అభివృద్ధిలో ఇందిరాగాంధీ సేవలను కొనియాడారు.

భాగస్వామ్యంతో పాలన అనుసంధానం సాధ్యం

తిరుపతి ఐఐటీ, క్రిస్ప్ భాగస్వామ్యం ● జాతీయ వర్క్‌షాప్ ప్రారంభం


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, క్రిస్ సీఈవో సుబ్రహ్మణ్యం

ఏర్పేడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): భాగస్వామం ద్వారా విద్యా సిద్ధాంతాలు, పాలన అంశాల మధ్య అనుసంధానం సాధ్యమవు తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. తిరుపతిలోని ఐఐటీ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగం, సెంటర్ ఫర్ రీసెర్చి ఇన్ స్కీం అండ్ పాలసీస్(క్రిస్ప్) సంయుక్తంగా మూడు రోజుల జాతీయస్థాయి వర్క్‌షాప్ పబ్లిక్ పాలసీ ఇన్ ప్రాక్టీస్‌ను అక్టోబరు 30 నుంచి నవంబరు 1 వరకు నిర్వహిస్తోంది. తిరపతి ఐఐటీ ప్రాంగణంలో అక్టోబరు 30న అధికారికంగా ప్రారంభించినప్పటికీ 31న నిపుణుల చర్చలు జరిగాయి. ఈ వర్క్‌షాప్‌లో ప్రజా విధానాల రూపకల్పన, అమలులో విశిష్ట సేవలందించిన ఐఏఎస్ అధికారులు, అకడమిక్ నిపుణులు, పరిశోధకులు పాల్గొని తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకుంటున్నారు. ఈ వర్క్‌షాప్‌లో విశ్రాంత ఐఏఎస్ అధికారులు ఎస్ఎం విజయానంద్, సుబ్రహ్మణ్యం, ఆర్ఎస్ జులానియా, రాజీవ్ సదానందన్, ఎస్‌జే కుంటే, చంద్రమౌళి పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ... ఈ తరహా వర్క్‌షాప్‌లతో అనుభవాత్మక అభ్యాస్యాన్ని బలోపేతం చేస్తాయని తెలిపారు. అదే విధంగా క్రిస్ప్ సీఈవో ఆర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ... భాగస్వామ్యం డేటా ఆధారిత పాలనకు మార్గం శుభం చేస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, పాలన, నిపుణులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రూపంలో ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. ప్రజా విధానాల అనుభవాలపై పెరుగుతున్న ఆసక్తిని వర్క్‌షాప్ ప్రతిబింబించింది.

ప్రధాన చర్చలు

ఈ వర్క్‌షాప్‌లో పేదరిక నిర్మూలన, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, విద్య, జనాభా గణాంకాలు, నైపుణ్య ఆధారిత ఉన్నత విద్య వంటి ప్రధాన అంశాలపై చర్చలు జరిగాయి. విద్యార్థులు ప్రజా విధానాల రూపకల్పన, అమలులో ప్రయోగిక అవగాహన పొందేందుకు నిపుణులు మార్గదర్శకత్వం వహించారు.

ఐఐటీ తిరుపతి-క్రిస్ప్ ఒప్పందం

వర్క్‌షాప్ తొలిరోజు ఐఐటీ తిరపతి, క్రిస్ప్ మధ్య దీర్ఘకాలిక భాగస్వామ్యానికి అవగాహన ఒప్పందం కుదిరింది. దీనిపై తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, క్రిస్ప్ కార్యదర్శి, సీఈవో సుబ్రహ్మణ్యం సంతకాలు చేశారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి విజయానంద్, అధ్యాపకులు పాల్గొని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ భాగస్వామ్యం ద్వారా ప్రజా విధానాల బోధన, పరిశోధన, డేటా ఆధారిత పాలనలో రెండు సంస్థలు కలిసి పని చేయనున్నాయి.

సమస్యలపై అధికారులు స్పందించాలి

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలపై అధికారులు స్పందించాలని ఎంపీపీ మేకల సుబ్బలక్ష్మి కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకటరత్నమ్మ మాట్లాడుతూ... మండల స్థాయి అధికారులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో బాగా పని చేయడం వలన పెద్దగా మొంథా తుఫాన్‌తో నష్టం జరగలేదన్నారు. సచివాలయ కార్యదర్శులు గ్రామాల సమస్యలను రాత పూర్వకంగా ఇస్తే సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరిస్తానన్నారు. ఏవో షణ్ముగం మాట్లాడుతూ తుఫాన్ కారణంగా తలారివెట్టు గ్రామంలో 5 ఎకరాల వరి పంట దెబ్బతిందన్నారు, మిగతా గ్రామాల్లో వరి, ఇతర పంటలు నారుమళ్లు నీటమునిగాయని తెలిపారు. వరి పంట వేసి నష్టపోయిన రైతులకు 80శాతం రాయితీపై వరి విత్తనాలు అందిస్తామని చెప్పారు. కల్లివెట్టు, నెర్రిణికండ్రిగ, పుత్తేరి, పార్లపల్లి, కాంపాళెం, కొత్తపాళెం, చిన్నాయగుంట, కాటూరుల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సర్పంచులు సభ దృష్టికి తీసుకు వచ్చారు. పాసుపుస్తకాలు లేని భూములకు గుర్తింపు కార్డులు ఇవ్వని కారణంగా పలురు యూరియా తెచ్చుకోలేకపోతున్నారని భవానీశంకరాపురం సర్పంచ్ రాజయ్య చెప్పారు. తహసీల్దార్ శ్రీదేవి, కాటూరు సహకార సంఘం చైర్మన్ భాస్కర్‌యాదవ్ సహా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేత్రపర్వం... ఆకాశదీపం

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడి ఆలయంలో శుక్రవారం ఆకాశదీపం నేత్రపర్వంగా సాగింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగిస్తుంటారు. ఇందులో భాగంగా ఆలయ అధికారులు ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలుచేశారు. అనంతరం స్థూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. భక్తులు విశేషంగా ఆకాశదీపాన్ని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వెండి తొడుగు వితరణ



శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ముత్యాలమ్మ ఆలయంలో కొలువై ఉన్న వినాయకస్వామికి అంబూరు రవిబాబు కుటుంబ సభ్యులు ఇత్తడి తొడుగులను అందజేశారు. వాటిని ఈవో బాపిరెడ్డి స్వీకరించారు. దాతకు కృతజ్ఞతలు తెలిపి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

పరశురామేశ్వరుడి సేవలో జబర్దస్త్ నటుడు సద్దాం



ఏర్పేడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): గుడిమల్లంలో వెలసిన పరశురామేశ్వరస్వామిని శుక్రవారం జబర్దస్త్ నటుడు సద్దాం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పారిశుధ్య కార్మికుల నిరసన



రేణిగుంట అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పారిశుధ్య కార్మికులు విధులు బహిష్కరించారు. చెత్త సేకరణ సమ యంలో డబ్బు డిమండ్ చేస్తున్నారంటూ పారిశుధ్య కార్మికులపై ఫిర్యాదులందాయి. దీనిపై విచారణకు వస్తుండగా పారిశుధ్య కార్మికుడు హరి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హరి వైద్య ఖర్చులకు నిధులు మంజూరు చేయాలంటూ పారిశుధ్య విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. దీంతో స్పందించిన ఈవో పీఆర్డీ ప్రభువురావు రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్మికుడికి పంచాయతీ తరఫున సాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో విధులకు హాజరయ్యారు.

అత్తి వరదరాజస్వామికి ప్రత్యేక పూజలు


రుత్వికుల హోమం - స్వామివారిని దర్శించుకుంటున్న ఈవో తదితరులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కొలువై ఉన్న ప్రసన్న వరదరాజస్వామి ఆలయంలో అత్తి వరదరాజ విగ్రహ ప్రతిస్థాపన పూజలుజరుగుతున్నాయి. ఇందులోభాగంగా శుక్రవారం స్వామివారికి పలు రకాల అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అంతకు ముందు పలురకాల హోమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ సాయిప్రసాద్, ఈవో బాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు



శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం చలో హైదరాబాద్ కార్యక్రమంలో పాల్గొనడానికి తరలివెళ్లారు. దళితుల ఆత్మగౌరవం నిలబెట్టుకునే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. ఇర్ల రాజా, ఎం. ఈశ్వర్, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

అండర్-17 రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు దర్శిని



పిచ్చాటూరు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అండర్-17 నెట్‌బాల్ పోటీలకు పట్టణంలోని జడ్పీ హైస్కూలులో 9వ చదువుతున్న దర్శిని ఎంపికైనట్టు పీడీలు స్వర్ణ, రమాదేవి తెలిపారు. ఈ నెల 30న అన్నమయ్య జిల్లా కొత్తమంచూరు జడ్పీ హైస్కూలులో జరిగిన జిల్లాస్థాయి అండర్-17 నెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయికి ఎంపికైందన్నారు. దర్శినిని పాఠశాల హెచ్ఎం గిరిప్రకాష్ అభినందించారు. నవంబరు 8,10 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి క్రీడల్లో దర్శిని పాల్గొంటుందని తెలిపారు.

శిక్షణ పొందిన మహిళలకు రుణాలు


ఆర్యవర్క్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ అదనపు పీడీ తదితరులు

ఏర్పేడు, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మహిళల శిక్షణ పూర్తి అయిన తరువాత బ్యాంకులతో మాట్లాడి రుణాలు ఇప్పిస్తామని డీఆర్‌డీఏ అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి చెప్పారు. మండలంలోని ఇసుకతాగేలిలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మహిళలకు ఏర్పాటు చేసిన ఆర్యవర్క్, పెయిటింగ్ శిక్షణ తరగతులను శుక్రవారం ఆమె పరిశీలించారు. అదే విధంగా మహిళలకు ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ తరగతులను తనిఖీ చేశారు. గుడిమల్లంలో నేటివ్ ఆరకు కాఫీ షాపును ఏర్పాటు చేయబోతున్న సభ్యులతో సమావేశమయ్యారు. డీపీఎం వనజాక్షి, ఏపీఎంలు దాక్షాయణి, ఆదినారాయణ పాల్గొన్నారు.

పూలే గురుకుల పాఠశాలలో సోషల్ టీచర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సత్యవేడు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న టీజీటీ షోషల్ టీచర్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణస్వామి తెలిపారు. ఈ మేరకు ఈ నెల 4న అభ్యర్థులకు డెమో నిర్వహించి తీసుకోనున్నట్లు వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు పాఠశాలలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

షరీఫ్ కుటుంబానికి ఆర్థిక సాయం



వరదయ్యపాలెం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ కాలువలో గల్లంతై మృతి చెందిన కారు డ్రైవర్ షరీఫ్ కుటుంబానికి వరదయ్యపాళెం మాజీ సర్పంచ్, వైసీపీ నేత బి.తిలక్‌బాబు రూ. 25 వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. అయ్యప్ప దీక్షలో ఉన్న తిలక్ బాబు నగదును తన చిన్నాన్న, విశ్రాంత బ్యాంకు మేనేజర్ బొప్పన మోహన మురళి చేతుల మీదుగా షరీఫ్ కుటుంబానికి అందించారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన

శ్రీకాళహస్తి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీలో స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. పథక సంచాలకురాలు డాక్టర్ ప్రమీలమ్మ పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సంస్థ మేనేజరు భాస్కర్, ఏఎన్ఎం మౌనిక, సునీత, కీర్తి, కళావతి పాల్గొన్నారు.

రాజ్యాంగంపై విద్యార్థులకు పోటీలు



కేవీబీపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు మండలస్థాయి పోటీలు నిర్వహించారు. ఎంఈవో రవికుమార్ ఆధ్వ ర్యంలో పది ఉన్నత పాఠశాలల్లోని ఒక్కో పాఠశాల నుంచి ఆరుగురు చొప్పున కేవీబీ పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన, క్విజ్, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కె.ప్రశాంతి, తులసి, హస్సీమేరి మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వీరిని జిల్లాస్థా యికి ఎంపిక చేసినట్లు హెచ్ఎం సురేష్ తెలిపారు.

ఇసుక తరలిస్తున్న వాహనాల సీజ్

రేణిగుంట అక్టోబర్ 31 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేసినట్టు గాజులమండ్యం ఎస్ ఐ సుధాకర్ తెలిపారు. శుక్రవారం తెల్లవారుజామున పిల్లపాళ్యం ప్రైవేటు భూముల్లో ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తుండగా మూడు ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ స్వాధీనం చేసుకుని గాజులమండ్యం పోలీస్ స్టేషన్ కు తరలించినట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసామన్నారు.